



రేపల్లె : అరవపల్లిగ్రామంలో ప్రత్యేక అలంకరణలో భారీ వినాయకుడు

గణపతియే నమః

వాడవాడలా ఘనంగా చవితి ఉత్సవాలు
స్వామి విగ్రహాల దర్శనాలకు పోటెత్తుతోన్న భక్తులు

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను జిల్లా అంతటా భక్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా గణపతి సంబరాల కోలాహలం నెలకొంది. ఈ ఏడు వందల సంఖ్యలో మండపాలను ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీలు అట్టహాసంగా పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచే ఆధ్యాత్మిక శోభతో ఆలయాలు, మండపాలు కళకళలాడాయి. వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాలను సుందరంగా అలంకరించి వినూత్న రీతుల్లో స్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండపాల్లో భారీ విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. వివిధ రూపాల్లో తీర్చిదిద్దిన ఉత్సవ మండపాలు, విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి విఘ్నేశ్వరుని దర్శించు కుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మట్టి గణపతిని ప్రతిష్ఠించగా ఎస్పీ తుషార్ డూడి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నేశ్వరస్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇళ్లలోనూ చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా ఘనంగా చవితి వేడుకలను జరుపుకున్నారు.



కారంచేడులోని మాస్కో వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడు



కర్లపాలెం మండలం పాపిరెడ్డిపాలెంలో ఏర్పాటు చేసిన వినాయకుడు



చందోలు లోని ఆర్యవైశ్యకళ్యాణ మండపం సత్రం నందు ఏర్పాటు చేసిన గణనాథుడు



పిట్టలవానిపాలెం : చందోలు రజకపేటలో వినాయక విగ్రహం

యూరియా కోసం బారులు

అరకొర పంపిణీతో ఎగబడుతున్న రైతులు

- సరిపడ నిల్వలు ఉన్నాయని అధికారుల ప్రకటన
- క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా అన్నదాతల ఇబ్బందులు
- అవసరానికి మించి కొనుగోళ్లతోనే ఇక్కట్లు అంటున్న అధికారులు
- బ్లాక్ చేసి సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు.. పట్టించుకోని అధికారులు

వర్షాలతో సాగుపనుల్లో నిమగ్నం కావాల్సిన రైతులు ఎరువుల కోసం ఎగబడాల్సి వస్తోంది. ప్రస్తుత అవసరాలకు సరిపోయినంతగా యూరియా అందుబాటులో ఉందని అధికారులు ప్రకటిస్తున్నా.. తమకు దొరుకుతుందో లేదో.. అవసరమైనప్పుడు ఇబ్బంది పడుతామేమోనన్న ఆందోళనలో రైతులు విక్రయ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. సిఫార్సులతో కొందరు అదనంగా కొనుగోలు చేస్తుండటంతో సన్న,చిన్నకారు రైతులకు యూరియా అందక అల్లాడుతున్నారు. సహకార సొసైటీలు, రైతు సేవా కేంద్రాల వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరి కనబడుతున్నారు. ఇదే అదనుగా కొందరు యూరియాను బ్లాక్ చేసేస్తున్నారు. 60 శాతం సరఫరా చేసినట్లు అధికారిక గణాంకాలు ఉన్నాయి. అయితే అధికశాతం రైతులు తమకు ఎరువులు అందలేదని ఆరోపిస్తున్నారు.

(బాపట్ల, రేపల్లె, కొల్లూరు, దాచేపల్లి, గుంటూరు సిటీ-ఆంధ్రజ్యోతి)

సాగు విస్తీర్ణంతో బేరీజు వేస్తే ప్రస్తుతం కేటాయించిన యూరియా నిల్వలు మిగులుగా ఉండాలి. కానీ ఆ పరిస్థితి లేకపోగా రైతులు ఇక్కట్లు పడాల్సిన వింత పరిస్థితి గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కనిపిస్తోంది. ఉదాహరణకు బాపట్ల జిల్లాలో సెప్టెంబరు చివరికి యూరియా అవసరాలు 22,000 మెట్రిక్ టన్నులుగా వ్యవసాయశాఖ అంచనా వేసి 13,000 టన్నులు కేటాయించినట్లు చెబుతున్నారు. 27వ తేదీకి గుంటూరు జిల్లాకు 363 మెట్రిక్ టన్నులు, బాపట్లకు 417 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చింది. ప్రస్తుతం గుంటూరు, బాపట్ల జిల్లాల్లోనే యూరియా అవసరం ఎక్కువగా ఉంది. అయితే ఇప్పటికీ యూరియా కోసం రైతులు మూడు జిల్లాల్లోనూ ఎగబడుతూనే ఉన్నారు. ఇదే పరిస్థితి అటు గుంటూరు, ఇటు పల్నాడు జిల్లాల్లోనూ నెలకొని ఉంది. సీజన్‌లో అవసరాలకు సరిపడా (మిగతా 8లో)



కొల్లూరు మండలం గాజుల్లంక పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతుల పడిగాపులు



పొందుగల చెక్ పోస్టు వద్ద విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న యూరియా బస్తాలు

హద్దులు దాటిన యూరియా దందా

పుష్కలంగా ఉన్న ఎరువులను వ్యాపారులు పక్కదారి పట్టిస్తున్నారు. వ్యాపారులు, దళారులు మాఫియాగా మారి యూరియాను ఇష్టానుసారంగా అమ్ముకుంటున్నారు. పల్నాడు జిల్లాలోని దాచేపల్లి, మాచర్ల, రెంటచింతల మాచవరం, పిడుగురాళ్ల మండలాల నుంచి (మిగతా 8లో)

పూల కోసం వెళ్లి మృత్యుఒడిలోకి

చెరువులో మునిగి ఇద్దరు పిల్లల మృతి
వినాయకచవితి పండుగ వేళ పూండ్లలో విషాదం

బాపట్ల రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని అట్టహాసంగా జరుపుకోవాలని స్నేహితులతో కలిసి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పూజకు అవసరమైన కలువ పూల కోసం వెళ్లి చెరువులో మునిగి మృతి చెందారు. ఈ విషాద ఘటనతో పండుగ వేళ బుధవారం బాపట్ల మండలం పూండ్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పూండ్ల గ్రామంలోని పిల్లలు శివాలయంలో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పూజకు అవసరమైన కలువ పూల కోసం బుధవారం ఉదయం గ్రామానికి చెందిన సైకం నాగభూషణం(17), శుద్ధపల్లి శ్రీమంత్(15) అనే ఇద్దరు మరో స్నేహితుడితో కలిసి గ్రామశివారులోని పొన్నూరు మండలం రమణపాలెం సమీపంలోని చెరువు వద్దకు వెళ్లారు. నాగభూషణ, శ్రీమంత్ తొలుత చెరువులో దిగగా మునిగిపోయారు. గట్టుమీద నుంచి గమనించిన స్నేహితుడు గ్రామంలోకి వెళ్లి సమాచారం ఇచ్చాడు. గ్రామస్థులు వచ్చేసరికి అప్పటికే చెరువులో లోతుకు వెళ్లిన ఇద్దరూ మృతి చెందారు. ఇంటర్మీడియట్ చదువుతున్న పెద్దకుమారుడు నాగభూషణం మృతితో సైకం శ్రీనివాసరావు, జయలక్ష్మి కన్నీటి పర్యంతమయ్యారు. శ్రీమంత్ జన్మస్థలం ఒంగోలు కాగా చిన్నప్పటి నుంచి పూండ్లలోని మేనమామ అయిన బ్రహ్మం దగ్గర ఉంటూ చదువుకుంటున్నాడు. అల్లారిముద్దుగా పెంచుకుంటున్న మేనల్లుడి మృత్యువార్త వినగానే మేనమామ, తాత, అమ్మమ్మలు విషాదంలో మునిగిపోయారు.





నాగభూషణం, శ్రీమంత్ (ఫైల్‌ఫొటో)

పింఛన్‌లపై వైసీపీ అసత్య ప్రచారాలు : మంత్రి గొట్టిపాటి

అద్దంకి, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్‌లపై వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తున్నదని, అర్హులైన ఏ ఒక్కరి పింఛన్‌ను కూటమి ప్రభుత్వం తొలగించదని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మండలం జార్లపాలెంలో గురువారం పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగుల ముసుగులో అనర్హులు కొంత మంది పింఛన్‌లు తీసుకుంటున్నారని, వారి పింఛన్‌లు మాత్రం ఖచ్చితంగా తొలగిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 15 నెలలోనే అభివృద్ధి అంటే ఏమిటో చూపించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లో 65 లక్షల మందికి 33వేల కోట్ల రూపాయలు పింఛన్ పంపిణీ చేస్తున్నదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. ఇప్పటికే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం, స్త్రీశక్తి పథకాలను అమలు చేసిందన్నారు.

- ఉధృతంగా కృష్ణమ్మ భయాందోళనలో ప్రజలు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు
- సాగర్ 26 క్రస్ట్‌గేట్ల నుంచి నీటి విడుదల
- ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక



ప్రకాశం బ్యారేజి దిగువకు ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది వరదనీరు

వీడని వర్షాలు

రేపల్లె, కొల్లిపర, విజయపురిసౌత్, రెంటచింతల, అచ్చంపేట, అమరావతి, తాడేపల్లి టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్క డక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే తీ వ్రంగా నష్టపోయిన రైతులు వీడని వర్షాలతో అల్లాడుతున్నారు. మరోవైపు ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద ప్రవాహంతో నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణానదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో కట్టలను తాకుతూ ప్రవహిస్తున్న నీటితో నదీ తీర ప్రాంతప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దీంతో బ్యారేజీ దిగువున గ్రామాలు, లంకల్లోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. నదీ తీరంలో ఎక్కడికక్కడ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ భద్రతా చర్యలు తీసుకున్నారు. బుధవారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో వాగులు పొంగి ప్రవహించడంతో ఎక్కడికక్కడ రాకపోకలు స్తంభించిపోయాయి. వాగుల వెంబడి సాగుభూములు వరద నీటితో చెరువులను తలపిస్తున్నాయి.

నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం కొనసాగుతుంది. శ్రీశైలం నుంచి 2,46,410 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో గురువారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. నీటిమట్టం 586.60 అడుగులు ఉండగా 2,46,410 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సత్రశాలలోని సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు 14 గేట్లను ఎత్తి 1,84,833 క్యూసెక్కుల నీటిని దిగువన వున్న పులిచింతలకు విడుదల చేశారు. సాగర్ నుంచి వస్తున్న నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నారు. వరద నీటి ఉధృతితో ప్రాజెక్టులో విద్యుదుత్పత్తిని కూడా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరదతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది పరవళ్ళు తొక్కుతోంది. ఎగువ నుంచి గురువారం 4,43,184 క్యూసెక్కుల వరదనీరు రిజర్వాయర్‌కు చేరుతోంది. వరద 4 లక్షల క్యూసెక్కులు దాటడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 4 లక్షల 32 వేల 837 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో నదీతీర, లంకల్లోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

కరకట్ట వెంబడి పెట్రోలింగ్

భట్టిప్రోలు మండలం కరకట్ట నుంచి పెసర్లంక వెళ్లే చినరేవు ఓలేరు నుంచి లంకగ్రామాలకు వెళ్లే చిన్నరేవులో వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెనుమూడి పుష్కర్‌ఘాట్‌ను వరద నీరు తాకింది. అధికారులు కరకట్టవెంబడి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. రేపల్లె తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావు వరద ఉధృతిని పరిశీలించి పరిస్థితిని అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేసి గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేశారు. కొల్లిపర తహసీల్దారు సిద్ధార్థ, ఎస్ఐ కోటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్ గురువారం బొమ్మువానిపాలెం, కొల్లిపర, అన్నవరం గ్రామాల్లోని రేవులను సందర్శించి వరద ఉధృతిని పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.



రేపల్లె మండలం రావిఅనంతవరం సమీపంలో కృష్ణానదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

8

దరఖాస్తు చేయకుంటే మీ సంగతి చూస్తాం

- అసోసియేషన్ నేతలతో ఎక్సైజ్ అధికారుల హెచ్చరికలు
- బార్లకు నేటితో ముగియనున్న గడువు.. వ్యాపారులతో చర్చలు

గంజాయి విక్రయదారుల అరెస్టు

పదోన్నతుల కోసం ఏఎన్ఎంల నిరసన

బీఫార్మసీ విద్యార్థి ఆత్మహత్య

- కళాశాల ఎదుట మృతదేహంతో ఆందోళనకు యత్నం
- అడ్డుకున్న పోలీసులు

6

అత్యాచారం కేసులో నిందితులకు రిమాండ్



చిలకలూరిపేటలో కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, అప్పారావు తదితర టీడీపీ నేతలు

కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, సీనియర్ టీడీపీ నేతలు

చిలకలూరిపేట, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన అనుచరులు అప్పారావు తదితరులపై వైసీపీ ప్రభుత్వ కేసులకు సంబంధించి గురువారం చిలకలూరిపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణకు హాజరయ్యారు. ఈ కేసులను విచారించిన జడ్జి కె నరేంద్ర రెడ్డి సెప్టెంబరు 1 న తీర్పు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. జగన్ ప్రభుత్వ హయాంలో 2023 సెప్టెంబర్‌లో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ చిలకలూరిపేట నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. ఆ సందర్భంలో ప్రత్తిపాటి పిలుపు మేరకు జాతీయ రహదారిపై తిమ్మాపురం వద్ద ధర్నా చేశారని యడ్లపాడు పోలీసు స్టేషన్ లో కేసు నమోదయింది. ఈ కేసులో ప్రత్తిపాటితో పాటు యడ్లపాడు మండలానికి చెందిన మరో 20 మంది సీనియర్ టీడీపీ నాయకులపై కేసు నమోదయింది. వారిలో కుర్రా అప్పారావు, ముద్దన నాగేశ్వరరావు, గోనుగుంట్ల శివ, పోపూరి వెంకయ్య తదితరులు ఉన్నారు. కాగా 2024లో చిలకలూరిపేట అర్బన్ పోలీసు స్టేషన్ లో నమోదైన మరొక కేసుకు సంబంధించి కూడా ప్రత్తిపాటితో పాటు మరో 29 మంది సీనియర్ టీడీపీ నాయకులు కోర్టుకు హాజరయ్యారు. అప్పటి మంత్రి విడదల రజిని మరిది అయిన విడదల గోపీ, అతని అనుచరులు, పలువురు వైసీపీనేతలు కోటప్పకొండ వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలతో ఘర్షణకు పాల్పడిన అనంతరం చిలకలూరిపేట అర్బన్ పోలీసు స్టేషన్ వద్ద జరిగిన ఘటనపై టీడీపీనేతలు, కార్యకర్తలతో పాటు ప్రత్తిపాటిపై కూడా కేసు నమోదయింది. ఈ కేసులో ఉన్న మొత్తం 30 మంది విచారణకు హాజరయ్యారు. వీరిలో సీనియర్ టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, తుబాటి శ్రీహరి, పిల్లి కోటి, బుచ్చిబాబు, మారెళ్ళ అప్పారావు, స్టీఫెన్ కరుణాకర్ తదితరులు ఉన్నారు. కోర్టులో ప్రత్తిపాటి, ఆయన అనుచరుల తరపున న్యాయవాదులు ఈవూరి బ్రహ్మానందం, తుబాటి పూర్ణచంద్రరావు, జీవిహెచ్ ప్రసాద్, టీడీపీ లీగల్ టీమ్ విచారణకు హాజరయ్యారు.

మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలి

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు



సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అమరవీరుల పోరాటస్ఫూర్తితో ప్రజలు మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. గురువారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని గాంధీ పార్కు వద్ద బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల నివాళి, సంస్మరణ సభ జరిగింది. ఉద్యమంలో అమరులైన విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ, బాలస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో విద్యుత్ చార్జీల వ్యతిరేక ప్రదర్శన సందర్భంగా బషీర్‌బాగ్ వద్ద పోలీసులు జరిపిన కాల్పుల ఘటన జరిగి 25 ఏళ్ళు గడిచిందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.అంజనేయులు నాయక్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట రూ.32 వేల కోట్లు ప్రజలపై భారాలు వేసిందని, విద్యుత్ సంస్థకు చెల్లించాల్సిన రూ.1.25లక్షల కోట్లు చెల్లించకుండా స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలపై భారాలు వేసేందుకు కుట్రలు పన్నిందన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన బీజేపీ తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణలను టీడీపీ, జనసేన ప్రశ్నించడం లేదని, రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టి ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. సంస్మరణ సభకు సీపీఎం నరసరావుపేట మండల కార్యదర్శి డీ శివకుమారి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ మారుతి వరప్రసాదు, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల కోసం ఏఎన్ఎంల నిరసన



గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్ఎంలు

గుంటూరు సిటీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన 34 మంది సచివాలయం ఏఎన్ఎంలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం వద్ద గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆరు నెలల క్రితం జిల్లాలో గ్రేడ్-3 ఏఎన్ఎంలకు గ్రేడ్-2 గా ప్రమోషన్‌లు ఇచ్చారు. అప్పట్లో మొత్తం 300మందితో ప్రమోషన్‌ల జాబితా రూపొందించారు. అయితే ఆ రోజు కేవలం 266మందికి మాత్రమే ప్రమోషన్ ఇచ్చారు. మిగిలిన వారికి పది రోజుల్లో ప్రమోషన్‌లు ఇస్తామని చెప్పి పంపారు. ఆరు నెలలు దాటిన తరవాత ప్రమోషన్‌లు ఇస్తాం రమ్మని చెప్పి జిల్లా అధికారులు 34మంది అర్హులైన ఏఎన్ఎంలను గుంటూరులోని కార్యాలయానికి పిలిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాచిన తరవాత ఇప్పుడు ప్రమోషన్‌లు ఇవ్వటం లేదని అధికారులు చెప్పటంతో ఆగ్రహించిన ఏఎన్ఎంలు జిల్లా అధికారి కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ జనరల్ పోస్టులకు కొత్తగా ఆర్ఓఆర్ తయారుచేయాలని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

165 యూరియా బస్తాలు స్వాధీనం

దాచేపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కారంపూడి నుంచి తెలంగాణలోని కొత్తగూడేనికి తరలిస్తున్న 165 బస్తాల ఎరువులను గురువారం తెల్లవారు జామున దాచేపల్లి మండలం పొందుగుల పోలీసు చెక్‌పోస్టు వద్ద అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం కాంచనపల్లి గ్రామానికి చెందిన సఖిల సురేష్ తదితరులు కారంపూడి నుంచి 165 యూరియా బస్తాలను రెండు వాహనాల్లో తరలిస్తుండగా పొందుగుల పోలీసు చెక్‌పోస్టు వద్ద సాధారణ తనిఖీల్లో పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసిన విజిలెన్స్, పోలీసు, వ్యవసాయశాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

బీఫార్మసీ విద్యార్థి ఆత్మహత్య

● కళాశాల ఎదుట మృతదేహంతో ఆందోళనకు యత్నం
● అడ్డుకున్న పోలీసులు



సూర్య (ఫైల్)

మేడికొండూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం జంగంగుంట్లపాలెం పరిధిలోని ఒక బీఫార్మసీ కాలేజీలో చదువుతున్న విద్యార్థి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థి మృతికి కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ కారణమని ఆరోపిస్తూ గురువారం విద్యార్థి మృతదేహంతో కళాశాల ఎదుట బంధువులు ఆందోళనకు ప్రయత్నించారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం అంబటిపూడికి చెందిన తాళ్లూరి సూర్య జంగంగుంట్లపాలెంలోని బీఫార్మసీ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. సత్తెనపల్లిలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో ఉంటూ కళాశాలకు వచ్చి వెళుతున్నాడు. కళాశాలలో జూనియర్ విద్యార్థినితో సూర్య మాట్లాడుతుండాన్ని గమనించిన అసిస్టెంట్ ప్రిన్సిపాల్ హెచ్చరించారు. అయినా సూర్య ఆ విద్యార్థినితో మాట్లాడుతుంటడాన్ని సీరియస్‌గా తీసుకున్న అసిస్టెంట్ ప్రిన్సిపాల్, సూర్యని గట్టిగా మందలించాడు. తీవ్ర మనస్తాపానికి గురైన సూర్య తానుంటున్న హాస్టల్లో బుధవారం పురుగుమందుతాగి స్పృహతప్పి పడిపోయాడు. ఇతనిని గమనించిన సహచర విద్యార్థులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మరణించాడు. విద్యార్థి మరణానికి కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ కారణమని ఆరోపిస్తూ విద్యార్థి బంధువులు గురువారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిని నుండి మృతదేహాన్ని గ్రామానికి తరలిస్తూ మార్గమధ్యంలో కళాశాల వద్ద మృతదేహాన్ని ఉంచి ధర్నాకు ప్రయత్నించారు. సమాచారాన్ని ముందుగానే తెలుసుకున్న పోలీసులు కళాశాల వద్దకు చేరుకొని ధర్నా ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వటంతో మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డుకు గౌరీనాథం ఎంపిక



జీ గౌరీనాథం

మాచవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 5వ తేదీ ఇవ్వనున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డుకు గొల్లపల్లి గౌరీనాథం ఎంపికైనట్టు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పీ నాగయ్య, గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌సీ కేఎస్ లక్ష్మణరావు గురువారం తెలిపారు. గౌరీనాథం ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా అనేక విద్యాసంస్థల్లో పనిచేసి అనేకమంది విద్యార్థులను తీర్చిదిద్దటంలో చేసిన కృషికి ఫలితంగా ఈ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 31న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అవార్డు అందజేస్తారని తెలిపారు. గౌరీనాథం స్వస్థలం మాచవరం మండలం గంగిరెడ్డిపాలెం గ్రామం. ఈయన ప్రస్తుతం తమిళనాడులోని ఎస్ఆర్‌వీ ఇంటర్నేషనల్ స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

జాతీయ ప్రతిభా పురస్కారానికి నరసింహారావు..



చింతల నరసింహారావు

● పిడుగురాళ్ల: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారానికి స్థానిక ఎస్టీ జోసఫ్ బాలికల హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు చింతల నరసింహారావు ఎంపికైనట్లు హెచ్‌ఎం సిస్టర్ రాణి తెలిపారు. ఈ సందర్భంగా నరసింహారావుకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

అత్యాచారం కేసులో నిందితులకు రిమాండ్

నరసరావుపేట లీగల్, రొంపిచర్ల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఓ వివాహితను అత్యాచారం చేసిన కేసులో నిందితులైన రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామానికి చెందిన గుడిపాటి పుల్లారావు, ఉయ్యాల శివయ్యలకు రిమాండ్ విధిస్తూ స్థానిక రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయ అధికారి ఏ సలోమి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 25వ తేదీన నిందితులు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు రొంపిచర్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, గ్యాంగ్ రేప్ చట్టాల కింద కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను గురువారం అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పరచగా రిమాండ్ విధించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు

తెనాలి క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రంలో గంజాయి తక్కువ ధరలలో కొనుగోలు చేసి తెనాలిలో వాటిని అమ్ముతున్న ఐదుగురు సభ్యుల ముఠాను తెనాలి త్రీ టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... తెనాలి బాలాజీరావుపేట మహేంద్ర కాలనీకి చెం దిన పాలడుగు బాలకృష్ణ (42) పట్టణంలోని గంగానమ్మపేట, మసీదు ప్రాంతానికి చెందిన సయ్యద్ మొహజాహిద్ (26) ఇద్దరూ కలసి ఒరిస్సా రాష్ట్రంలోని పెదపాకాలలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి తె నాలిలో అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు. వారితో పాటు మరో ముగ్గురు ముఠాసభ్యులు అమృతలూరు మం డలం కూచిపూడికి చెందిన పోతార్లంక కార్తీక్ (20), బాలారావుపేటకు చెందిన యలవర్తి శివకుమార్ (30), చెంచుపేట అనిబీసెంట్ స్కూల్ ప్రాం త వాసి షేక్ సమీర్ హుస్సేన్ (27)లు కల సి బాలాజీరావుపేటలో మస్తానమ్మతోటకు చెందిన ఖాళీప్రదేశం పొదల మధ్య గంజా యి అమ్మకాలు చేస్తున్నారు. అంతేకాకుండా గంజాయి సేవిస్తున్న ఈ ముఠా కూడా అక్క డే దాగి ఉందన్న సమాచారంతో ఆకస్మికం గా దాడిచేసి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద 1.150 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్‌డీపీఎస్-1985 యాక్టు ప్రకారం అరెస్టుచేసి కోర్టులో ప్రవేశ పెట్టినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో పి.మురళి, డి.సురేష్, ఎస్ఐ జైకర్, అబ్దుల్ సలాంను డీఎస్పీ జనార్దనరావు అభినందించారు.



గంజాయి ముఠాను అరెస్టు చూపుతున్న తెనాలి త్రీ టౌన్ పోలీసులు

46,264 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 45,242 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 46,264 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,315 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	13800
334	10000	14300	**ఏసీ కామన్ వెరైటీ**		
నంబరు. 5	10000	13500	334	10500	14000
273	--	--	నంబరు. 5	10000	13600
341	10000	15200	341	11000	15500
4884	--	--	4884	10000	13000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	--	--	షార్క్-1	10000	15400
షార్క్-1	10000	15200	బ్యాడిగి 355	--	--
బ్యాడిగి 355	--	--	సింజెంటా బ్యాడిగి 5531	10000	14000
సింజెంటా బ్యాడిగి 5531	10000	14600	దేవనూరు డీలక్స్	--	--
దేవనూరు డీలక్స్	--	--	తాలుకాయలు	5000	7500

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కొత్తమాసు భాస్కర్ (ఫైల్)

చిలకలూరిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నరసరావుపేట రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. మృతి చెందిన వ్యక్తిని పట్టణంలోని మమ్మీ డాడీ డ్రెస్సెస్ షాపు యజమాని కొత్తమాసు భాస్కర్(49)గా గుర్తించారు. నరసరావుపేటలోని ఒక ఇంజనీరింగ్ కళాశాల నుంచి విద్యార్థుల యూనిఫాం విషయం మాట్లాడేందుకు చిలకలూరిపేట నుంచి బైక్‌పై నరసరావుపేట వెళుతుండగా లింగంగుంట్ల కావూరు గ్రామాల మధ్య ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఒకే వైపు వెళ్తున్న రెండు బైకులు అదుపు తప్పి ఢీకొన్నాయి. ఒక బైకుపై ఉన్న కొత్తమాసు భాస్కర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరొక బైక్ పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆ బైకుపై ఉన్న నాదెండ్ల మండలం చిరుమామిళ్లకి చెందిన రైతు కంచేటి వీరాంజనేయులు (63) గాయపడ్డాడు. రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

ఇష్టమైన పోస్టు ఎంపికకు అవకాశం కల్పించాలి

● జిల్లా ఆపస్ అధ్యక్ష, కార్యదర్శులు

వేమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా రెండు పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థులకు ఇష్టమైన పోస్టు ఎంపిక చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం బాపట్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసకుమార్, కుందుర్తి శ్రీనివాసులు కోరారు. గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డీఎస్సీ రాసే సందర్భంలో రెండు పోస్టుల ఎంపికకు అర్హత సాధించిన అభ్యర్థులకు వారికి ఇష్టమైన పోస్టు ఎంపిక కోసం అవకాశం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న డీఎస్సీ-25 నియామకాలలో పలువురు ఉపాధ్యాయులు ఒకటి కన్నా ఎక్కువ పోస్టులకు ఎంపికయ్యారు. ఎస్‌జీటీ స్థానాలు ఎక్కువగా ఉండి స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తక్కువ ఉన్నందున అభ్యర్థులు కాంపిటీషన్ దృష్ట్యా దరఖాస్తులు ఎక్కువ ఖాళీలు ఉన్న ఎస్‌జీటీ స్థానానికి మొదటి అవకాశాన్ని కోరుతూ స్కూల్ అసిస్టెంట్ స్థానాలకు రెండో అవకాశాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ పోస్టులు రెండింటికి అర్హత సాధించారన్నారు. గతంలో ఉపాధ్యాయుల పోస్టు ఎంపికను ముందుగా అడగలేదన్నారు. అభ్యర్థులు పరీక్షలో అర్హత సాధించిన తరువాతే ఆప్షన్స్ స్వీకరించారన్నారు. ఏపీపీఎస్సీ లేదా గ్రూప్స్ ఎగ్జామ్స్ ద్వారా పోస్టులకు ఎంపిక జరుగుతున్నప్పుడు మాత్రమే ఎంపిక క్రమాన్ని స్వీకరించేవారన్నారు. ఈసారి ఉద్యోగులు దరఖాస్తు పెట్టుకునేటప్పుడే ఎస్‌జీటీ, ఎస్ఏల ప్రాధాన్యతా క్రమాన్ని నిర్ణయించడం వల్ల అభ్యర్థులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలని కోరారు.

ఎన్నారై మెడికల్ కళాశాలకు శరీర దానం



గోగినేని రాకుమారి (ఫైల్‌ఫొటో)

వేమూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంపాడు గ్రామానికి చెందిన గోగినేని రాకుమారి(70) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమె పార్థివదేహాన్ని ఎన్నారై మెడికల్ కళాశాలకు భర్త సుబ్బారావు, కుమార్తె లక్ష్మీ దానం చేశారు. ఎన్ఆర్ఐ వైద్య కళాశాల అధికారులు అంబులెన్స్ ద్వారా రాకుమారి పార్థివదేహాన్ని కళాశాలలోని అనాటమీ విభాగానికి తరలించారు. ఆమె నేత్రాలను పెదకాకాని ఐ బ్యాంకుకు దానం చేశారు. నేత్రాలు ఇద్దరికి చూపు కల్పించడానికి ఉపయోగపడతాయని ఐ బ్యాంకు ప్రతినిధులు తెలిపారు. పార్థివదేహం ఒకటి, రెండు సంవత్సరాల పాటు వైద్య పరీక్షల పాఠ్యాంశాల బోధనకు దోహదపడుతుందని ఎన్నారై మెడికల్ అధికారులు తెలిపారు. రాకుమారి మృతి అనంతరం ఆమె భర్త, కుమార్తె తీసుకున్న నిర్ణయానికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

దివ్యాంగులు అర్హతను బట్టి అప్పీలు చేసుకోవాలి

● డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సీ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న దివ్యాంగులు అర్హతను బట్టి మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోల వద్ద అప్పీలు చేసుకోవాలని పల్నాడు జిల్లా డీఆర్‌డీఏ డైరెక్టర్ ఝాన్సీ గురువారం తెలిపారు. జిల్లాలో వికలాంగుల పెన్షన్లకు సంబంధించి రీ అసెస్మెంట్ చేసి 2727 మందికి నోటీసులు ఇచ్చామన్నారు. వీరిలో 1807మంది మాత్రమే మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోల వద్ద అప్పీలు చేసుకున్నారని చెప్పారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పొన్నూరు టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం నిడుబ్రోలు రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురించి స్థానికులు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న బాపట్ల రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి శవ పరీక్షల నిమిత్తం తరలించారు. అయితే గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ మృతి చెందాడ లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయంపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...

దాచేపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనం పైనుంచి జారి కిందపడటంతో ఓ యువకుడు మృతిచెందగా మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో జరిగింది. మృతుడు గురజాల మండలం మాడుగుల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడి పేరు వేణు(21) వినాయక విగ్రహం కొనుగోలు చేసేందుకు వస్తూ మార్గ మధ్యంలో నడికూడి గ్రామం వద్ద బండి పైనుంచి కింద పడిపోయారు. వేణు తలకు బలమైన గాయాలై మృతిచెందాడు. బండి వెనుక కూర్చున్న మరో ఇద్దరు యువకులు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయక విగ్రహాల నిమజ్జన సమయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ తుషార్ డూడీ ఆదేశించారు. ఈ విషయమై గురువారం ఆయన మాట్లాడుతూ కాల్వలు, వాగులు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో నిమజ్జనాలు నిర్వహించేటప్పుడు తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసుశాఖ సూచించిన సురక్షితమైన ప్రదేశాల్లోనే నిమజ్జనాలు నిర్వహించాలన్నారు. ఊరేగింపు సమయంలో డిజె, అసభ్యకర నృత్యప్రదర్శనలు నిర్వహించరాదన్నారు. కమిటీ సభ్యులు, నిర్వాహకులు సూచనలు,హెచ్చరికలు తప్పనిసరిగా పాటించాలన్నారు. పోలీసుశాఖ సహకారం అవసరమైన వెంటనే స్థానిక పోలీసుఅధికారులకు లేదా టోల్‌ఫ్రీనెంబరు 112కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. ప్రజలకు భద్రత కల్పించేందుకు పోలీసుశాఖ సంసిద్ధంగా ఉందని ఎస్పీ తెలిపారు.

ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం ప్రణాళికల తయారీ

● బాపట్ల విస్తరణా శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం సాధించడానికి ప్రణాళికల తయారీ, అమలును స్థానిక ప్రభుత్వాలకు అప్పగిస్తూ రాజ్యాంగబద్ధతను కల్పించారని బాపట్ల విస్తరణా శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డి. వెంకట్రావు తెలిపారు. ఈ కేంద్రంలో నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల శిక్షకులకు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. టీవోటీ ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిక్షణలో ఆయన మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో రాష్ట్రం ముందుండాలన్నారు. పంచాయతీ పురోభివృద్ధి సూచిక 2.0లో వచ్చిన మార్పులను పీఏఐ లాగిన్ వినియోగించి ఆయా గ్రామపంచాయతీలు సాధించిన స్కోర్‌లను పరిశీలించి వెనుకబడిన సూచికలను మెరుగుపర్చటానికి అందుబాటులో ఉన్న వనరులను పారదర్శకంగా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న బాపట్ల విస్తరణా శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు

దివ్యాంగుల ప్రేమవివాహం.. ఆశీర్వదించిన అధికారులు

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డులో దివ్యాంగులు గురువారం ప్రేమవివాహం చేసుకున్నారు. సంచారజాతుల రాష్ట్రప్రధాన కార్యదర్శి చల్లా రామయ్య ఆధ్వర్యంలో పర్చూరు మండలం గొల్లపూడి గ్రామానికి చెందిన బొట్టు గంగాధర్, ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామానికి చెందిన బడుగు శిరీష (సుందరమ్మ)లకు వివాహం జరిపించారు. ఎంతోకాలంగా ప్రేమలో ఉన్న వీరివురికి వివాహం జరిపించి పెద్ద ఆశీర్వచనాలు అందించారు. తహసీల్దార్ షేక్.సలీమా, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు, రమణబాబు, నవనీతం, లావణ్య, జాషువా, దివ్యాంగుల నాయకులు మల్లెల మౌనిక, షేక్ అమీర్‌బాషా, ఎం నాయక్, ప్రకాష్, ఆసోది రామిరెడ్డి తదితరులు నవదంపతులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ప్రేమ వివాహం చేసుకున్న వీరికి ప్రభుత్వం సాయం అందించాలని చల్లా రామయ్య కోరారు. మేజర్లైన వీరి వివాహానికి అడ్డుపడుతున్న వారిపై దివ్యాంగుల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



వివాహం చేసుకున్న దివ్యాంగుల దంపతులకు అక్షింతలు వేసి ఆశీర్వదిస్తున్న తహసీల్దార్ షేక్ సలీమా, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ బీఎస్ నారాయణ భట్టు తదితరులు

జిల్లా కేంద్రంలో తెలుగు అకాడమి శాఖను ఏర్పాటు చేయాలి

● తిమ్మన శ్యామ్‌సుందర్



తిమ్మన శ్యామ్‌సుందర్

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిజిల్లా కేంద్రంలో తెలుగు అకాడమి శాఖలను ఏర్పాటు చేయాలని బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, రచయిత తిమ్మన శ్యామ్‌సుందర్ కోరారు. తెలుగుభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటాల అనంతరం తెలుగుకు ప్రాచీనహోదా దక్కినప్పటికి ఆ గౌరవాన్ని నిలబెట్టుకోవటం క్లిష్టతరంగా మారిందన్నారు. ఆంధ్రభాష వ్యామోహమే అందుకు ప్రధాన కారణమన్నారు. పీజీ స్థాయి వరకు తెలుగును ఒక ఖచ్చితమైన పాఠ్యాంశంగా చేరినాడే మార్పుకు అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతిజిల్లా కేంద్రంలో తెలుగు అకాడమిశాఖను ఏర్పాటు చేసి మాతృభాష ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తే సమస్యకు కొంత పరిష్కారం లభిస్తుందని రచయిత తిమ్మనశ్యామ్ సుందర్ తెలిపారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మండలాన్ని సందర్శించిన డాక్టర్ ధీరజ్

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని చెరువుజమ్ములపాలెం-1 ఆయుష్మాన్ ఆరోగ్యమందిరాన్ని గురువారం డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ ధీరజ్ బృంద సభ్యులతో కలిసి సందర్శించారు. టీబీ నిర్మూలన, స్క్రీనింగ్ విధానాలు, టీబీ లక్షణాలు మీద ఆయన సూచనలు, సలహాలు చేశారు. క్యార్యక్రమంలో నరసాయపాలెం పీహెచ్‌సీ అధికారి డాక్టర్ వెంకటేష్, సూపర్‌వైజర్ మేరీ, సీహెచ్‌వో అరుణ, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ ధీరజ్

శ్రీలక్ష్మిపై విమర్శలు జగన్ అవినీతిని అంగీకరించడమే : కొల్లా

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన ఆశీస్సులతో వేలకోట్ల అవినీతికి ఆనవాలమైన ఓబుళాపురం మైనింగ్ కేసులో కాంట్రాక్టర్ గాలి జనార్దన్‌రెడ్డితోపాటు జైలుకెళ్లిన సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి ధరించే చీరలు, విగ్గులపైన మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి అవాకులు, చెవాకులు పేలటం నీచమని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి పేర్కొన్నారు. వైఎస్ జగన్‌కు వీరవిధేయుడునని చెప్పుకునే భూమన అప్పుడు నోరుమెదపక ఇప్పుడు ఆమెపై పిచ్చి పేలాపనలకు దిగటం సిగ్గుచేటు అన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

బాపట్లరూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజు అన్నారు. గురువారం వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని స్టూవర్టుపురం గ్రామపరిసర ప్రాంతాల్లో, బహిరంగ ప్రదేశాలలో పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మద్యం తాగుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాల్వలో గుర్తుతెలియని ద్విచక్రవాహనం

అమృతలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని ద్విచక్ర వాహనంను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని అమృతలూరు- పెదపూడి రహదారిలో గంగాయి చెరువు సమీపంలో పంట కాల్వలో ఉన్న యమహా కంపెనీకి చెందిన బ్లూ కలర్ ద్విచక్రవాహనంను స్థానిక రైతులు గుర్తించారు. ఈ వాహనం కాల్వలో ఎప్పటి నుంచి ఉన్నదో తెలియలేదని వారు చెబుతున్నారు. కాల్వలో నీరు సక్రమంగా ప్రవహించకపోవడంతో కాల్వను అక్కడ రైతు శుభ్రం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో కాల్వలోని వాహనం బయటపడటంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి వాహనంను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

17 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి 82.5 ఎకరాల భూమి సేకరణ

● ఎంపీడీవోలకు దరఖాస్తు చేసుకున్న వారికి పింఛన్

● కలెక్టర్ జె.వెంకటమురళి



వీడియో కాన్ఫరెన్స్‌కు బాపట్ల నుంచి హాజరైన కలెక్టర్ జె.వెంకటమురళి, జిల్లా అధికారులు

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ అంశాలపై సమీక్షించారు. జిల్లాలో అమలుచేస్తున్న కార్యక్రమాలు గురించి ముఖ్య కార్యదర్శికి వివరించారు. కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ పీఎం కుసుమ్ పథకం కింద జిల్లాలోని 22 ఫీడర్‌లకు 7సబ్‌స్టేషన్ పరిధిలో 17 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి 82.5 ఎకరాల భూమిని రైతుల నుంచి తీసుకున్నట్లు తెలిపారు. సూర్యలంకబీచ్ దగ్గర ఉన్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేవని 2015లో మంజూరు చేసిన పనుల్లో 70శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన 30శాతం పనులు త్వరలో పూర్తిచేయుటకు చర్యలు తీసుకుంటామ న్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద పింఛను పొందుతున్న ఆరోగ్య, దివ్యాంగుల పించన్‌లో వారి సదరన్ ధ్రువీకరణ పత్రాలు పునఃపరిశీలనలో భాగంగా అర్హత ఉండి ఫింఛన్ నిలుపుదల అయినటువంటి లబ్ధిదారులు ఎంపీడీవోలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఫించన్ ఇస్తామని అన్నారు. వారి ధ్రువీకరణపత్రాలను మరోసారి పరిశీలిస్తారన్నారు. అనర్హులుగా తేలిన యెడల ఫించన్ నిలుపుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి ఎలక్ట్రిక్ టూ సీటర్ ట్రైసైకిల్



దివ్యాంగుడికి ఎలక్ట్రిక్ టూ సీటర్ ట్రైసైకిల్ అందజేస్తున్న కలెక్టర్

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఓ దివ్యాంగుడి దీనస్థితి చూసి కలెక్టర్ జె.వెంకటమురళి చలించిపోయారు. అతనికి అవసరమైన వాహనాన్ని సమకూర్చి తన ఔదార్యం చాటుకున్నారు. జిల్లాలోని పర్చూరు మండలం చింతగుంటపాలెం గ్రామానికి చెందిన కంది అంజిరెడ్డికి 40వేల రూపాయల విలువ చేసే ఎలక్ట్రిక్ టూసీటర్ ట్రైసైకిల్‌ను గురువారం అందజేశారు. 5సంవత్సరాలుగా స్పైయిన్ టీబీ వ్యాధి కారణంగా నడవలేని స్థితిలో ఉన్న అంజిరెడ్డి పరిస్థితి చూసి తీవ్రంగా స్పందించిన కలెక్టర్ జె.వెంకటమురళిచేయూతనందించారు.

విఘ్నాలు తొలగిపోయి విజయాలు చేకూరాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



మున్నంవారిపాలెంలో వినాయకుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, టీడీపీ నాయకులు

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విఘ్నాలు తొలిగిపోయి ప్రజలందరికి విజయాలు చేకూరాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆకాంక్షించారు. పట్టణంలోని మున్నంవారిపాలెంలో నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకలలో ఎమ్మెల్యే పార్టీశ్రేణులతో కలిసి పాల్గొని పూజలు చేశారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, ధర్మేంద్రరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలి : ఎస్పీ

ప్రజలందరి జీవితాలలో వెలుగులు నింపాలంటూ ఎస్పీ తుషార్ డూడీ దంపతులు విఘ్నేశ్వరుడిని వేడుకున్నారు. జిల్లా ఏఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద డూడీ దంపతులు కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు. వారికి పూర్ణకుంభంతో ఏఆర్‌డీఎస్పీ పి.విజయసారధి ఆహ్వానం పలికారు. జిల్లాపోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, రిజర్వు ఇన్‌స్పెక్టర్ మౌలుద్దీన్, పట్టణ సీఐ ఆర్ రాంబాబు, రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, రూరల్ సర్కిల్ సీఐ బి.హరికృష్ణ, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వినాయక చవితి సందర్భంగా పూజలు చేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ దంపతులు

● కర్లపాలెం మండలంలోని 20 పంచాయతీలలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వందకుపైగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి గణనాధునికి భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు.

పిట్టలవానిపాలెం మండలంలోని గ్రామ పంచాయతీల్లో స్థానిక వినాయక కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన వినాయక మండపాలలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

● బాపట్లలోని 17వ వార్డు ఎస్ఎన్‌పీ అగ్రహారంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం దగ్గర శ్రీలక్ష్మి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జనసేన పార్టీనాయకుడు మాసా కళ్యాణ్ చక్రవర్తి వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

● బాపట్ల పట్టణంలోని చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయంలో శ్రీసంపత్ గణపతిపరివార్ ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 12అడుగుల ఎత్తు విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు.

● కొల్లూరు, భట్టిప్రోలు మండల గ్రామాల్లో గణేష్ మండపాల వద్ద ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో వడ్లమూడి వెంకట్రావు, గోగినేని చైతన్య, నూతక్కి మహేష్‌కుమార్, సుంకర సుమంత్ తదితరులు పాల్గొన్నారు. కొల్లూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలోని రోగులకు యూత్ సభ్యులు వైద్యాధికారి వెంకటసాయి చేతుల మీదుగా మజ్జిగ ప్యాకెట్లను రోగులకు అందించారు.

● భట్టిప్రోలు మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం కనకతప్పెట్లు డీజే సౌండ్లతో టపాసులు పేలుస్తూ పురవీధుల్లో వినాయకుని ఊరేగించారు. కొల్లూరు మండలంలోని చిలుమూరు, కొల్లూరు గ్రామాల్లో విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.



ఉప్పూడి రోడ్డులో పూజలు నిర్వహిస్తున్న అనగాని శివప్రసాద్, నాయకులు

● రేపల్లె పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి పందిళ్ళ పూజా కార్యక్రమాల్లో మంత్రి సోదరుడు అనగాని శివ ప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 50పందిళ్లల్లో ఒక్కో పందిరికి రూ.10వేలు చొప్పున కమిటీ వారికి అందజేశారు.

● రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లిలలో వినాయక చవితి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని పలు పందిళ్లలో జరిగిన వినాయక చవితి వేడుకల్లో జనసేనపార్టీ సీనియర్ నాయకుడు కమతం సాంబశివరావు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, పులిహోర, అందజేశారు.

సూర్యలంకను ఆంధ్రగోవాగా అభివృద్ధి చేయాలి

● కలెక్టర్‌ను కోరిన మా-ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరాన్ని ఆంధ్రగోవాగా తీర్చిదిద్దటానికి తగిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలంటూ కలెక్టర్ జె.వెంకటమురళిని సినీదర్శకుడు, మా-ఏపీ వ్యవస్థాపకులు దిలీప్‌రాజా కోరారు. ఈ విషయమై గురువారం ఆయన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి పలుప్రతిపాదనలు చేశారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పర్యాటకశాఖా మంత్రి, బాపట్ల ఎంపీ,ఎమ్మెల్యేలకు పంపినట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చెరుకుపల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుళ్ళపల్లి గ్రామంలో ఆరేపల్లిరోడ్డు వద్ద పొన్నపల్లికి చెందిన ట్రూవీలర్‌పై నుంచి పడి అలుమోలు సంజీవరెడ్డి(70) తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న బంధువులు అతనిని వెం టనే సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

భర్త బెదిరించాడంటూ ఫిర్యాదు

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దరివాదకొత్త పాలెంకు చెంది దొండిబోయిన వెంకటేశ్వరమ్మను, ఆమె కుమార్తెను భర్త ఏడుకొండలురెడ్డి తిట్టి బెదిరించాడంటూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ ఆర్ రాంబాబు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డబ్బులివ్వలేదని కొట్టి గాయపరిచారు

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉప్పరపాలెంకు చెందిన బి.జాన్‌శామ్యూల్‌ను అదేప్రాంతానికి చెందిన ఫిరోజ్ డబ్బులు అడిగితే ఇవ్వలేదని తల పగులగొట్టినట్లు ఫిర్యాదు చేశాడని సీఐ ఆర్ రాంబాబు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకు, కోడలుపై ఫిర్యాదు

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 12వవార్డు వెంగల్‌విహార్‌కు చెందిన దోనేపూడి శ్యామల్‌ను కొడుకు ఏలియా, అతని భార్య, అతని అత్తలు కలిసి వేధింపులకు గురిచేస్తున్నారంటూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాంబాబు తెలిపారు.

ఇంటిపై దాడి చేసిన వ్యక్తులపై కేసు

బాపట్లలోని 12వవార్డు వెంగళ్‌విహార్‌కు చెందిన కట్టుపల్లి రజనీని మార్పు రత్నం మరికొందరితో కలిసి వచ్చి ఇంటిపై దాడి చేసి తిట్టి బెదిరించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాంబాబు తెలిపారు.

స్మార్ట్‌మీటర్లు రద్దు చేస్తామంటూ మోసం

చెరుకుపల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రెండున్నర దశాబ్దాల క్రితం విద్యుత్‌చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా వామపక్షపార్టీల ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమంలో బషీర్‌బాగ్‌లో అప్పటి ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో ప్రాణాలు అర్పించిన విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ అమరవీరుల వర్ధంతి సందర్భంగా చెరుకుపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం సెంటర్ నందు వామపక్షాల ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, సీపీఐ(ఎంఎల్)నాయకులు మద్రివాడ వెంకట్రావులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న మోదీ-అదాని అనుకూల విద్యుత్ సంస్కరణలు పెరిగిన చార్జీలు, ట్రూఆఫ్‌చార్జీలు, స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు వంటి ప్రజా వ్యతిరేక విధానాలకు పోరాటాన్ని కొనసాగిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీపీఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండా రు శ్రీనివాసరావు, సీపీఐ ఎంఎల్ నాయకులు కోటేశ్వరరావు, ఓరుగంటి సూర్యప్రభావతి, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


జేవీవో ఆజాద్‌కు వీఎల్‌వోగా పదోన్నతి

వేమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరవలి గ్రామంలో పశు వైద్య శాఖ జూనియర్ వెటర్నరీ ఆఫీసర్‌గా పని చేస్తున్న అబ్దుల్ కలాం ఆజాద్‌కు పదోన్నతి లభించింది. వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్‌గా పదోన్నతిపై తెనాలి మండలం పినపాడు పశు సంవర్ధక శాఖ ఆసుపత్రికి బదిలీ అయ్యారు.

ఘనంగా రుషి పంచమి వేడుకలు

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : రుషి పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం భట్టిప్రోలులోని సాధనమండలి బ్రహ్మ విద్యా మండలిలో సప్తరుషులు యజ్ఞయాగాది కార్యక్రమాలు నిర్వహించారు. సప్త రుషులు సత్కరించి కర్పూర యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జంజనం హేమశంకరరావు, పొన్నపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల రికవరీ



సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి అందజేస్తున్న ఎస్ఐ అమరవర్ధన్

కొల్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పోయిన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు ఎస్ఐ అమరవర్ధన్ బుధవారం అందజేశారు. గతంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకుని బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ సమాచారాన్ని పోలీసులు కనుగొన్నారు. నాలుగు సెల్‌ఫోన్స్‌ను ఫిర్యాదుదారులకు ఎస్ఐ అందజేశారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.



అమృతలూరులో వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

చవితి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం అమృతలూరులో శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద శివా టెంపుల్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న 34వ సంవత్సరం వినాయక చవితి ఉత్సవాల్లో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గురువారం పాల్గొన్నారు. ఈసందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. యూత్ సభ్యులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. పండుగ రోజు సిద్ధి, బుద్ధి సమేత శ్రీవిఘ్నేశ్వరస్వామికి కన్నులపండుగగా కళ్యాణం జరిపారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, అమృతలూరు, పెదపూడి పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడు క్రొత్తపల్లి రవీంద్రబాబు, కొసరాజు దేవకుమార్, స్థానిక నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శివా టెంపుల్ యూత్ ఆధ్వర్యంలో శ్రీ అమృతేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సిద్ధి, బుద్ధి సమేత శ్రీవిఘ్నేశ్వరస్వామికి కల్యాణం నిర్వహించారు. కల్యాణం పురస్కరించుకుని స్వామి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో రథంపై గ్రామోత్సవం జరిపారు. భక్తులు హారతులు ఇచ్చారు.

ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్‌వోసీ అందజేత

అమృతలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్‌వోసీ బాధిత కుటుంబసభ్యులకు గురువారం అందజేశారు. అమృతలూరుకు చెందిన గరికపాటి నాగేశ్వరరావు అనారోగ్యంతో వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరారు. పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీలు అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ రూపంలో నాగేశ్వరరావుకు రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఈ చెక్కును నాగేశ్వరరావు కుటుంబసభ్యులకు గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కొల్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందిన బాధితులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. సీఎంఆర్ఎఫ్ కార్యాలయం నుంచి వచ్చిన చెక్కులను బుధవారం కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో బాధితులకు అందజేశారు. చిలుమూరుకు చెందిన పరుచూరి భీమయ్యకు రూ.77,053, కాసాని వాణికి రూ.40 వేలు, చినపులివర్రుకు చెందిన చల్లపల్లి జైపాల్ 60,460, కంఠంనేని కోటేశ్వరరావు రూ.20,541, క్రాపకు చెందిన మాదాల సాంబశివరావు రూ.38 వేలు, డొక్కు వీరభద్రయ్యకు రూ.19 వేలు, ఈపూరుకు చెందిన బాబురావు రూ.20,524 మొత్తం రూ.3,17,578ల చెక్కులను అందించగా బాధిత కుటుంబసభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పనిభారానికి తగినవిధంగా వేతనం పెంచాలి

● ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి కమల

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన పనిభారానికి తగిన విధంగా వేతనం పెంచాలని ఆంధ్రప్రదేశ్ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఎ.కమల డిమాండ్ చేశారు. ఆశావర్కర్స్‌యూనియన్ బాపట్లజిల్లా రెండో మహాసభలు సీఐటీయూ కార్యాలయంలో గురువారం జరిగాయి. జెండా ఆవిష్కరించి, కార్మిక రంగంలో చనిపోయినవారికి సంతాపం తెలిపారు. ఈమహాసభలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కమల మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే ఆశావర్కర్లకు కనీస వేతనం చెల్లిస్తామని ఎన్నిక మేనిఫెస్టోలో పెట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం 14నెలలు గడుస్తున్న నేటికి వేతనాలపై మాట్లాడటంలేదన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సి.హెచ్.మజుందార్, అధ్యక్షులు సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ అధ్యక్షులు జి.ఝాన్సీలక్ష్మీ, ధనమ్మ, వాణి, వివిధప్రాంతాల ఆశావర్కర్లు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఎ.కమల

ఈక్రాప్ నమోదు తప్పనిసరి

రేపల్లె, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రతిరైతు ఈ-పంటనమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో మహేష్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని తుమ్మల, మోళ్ళగుంట గ్రామాల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వర్షానికి నీటకు మునిగిన పొలాల రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. రైతులు ముఖ్యంగా యూరి యా కొరత ఉందని ఉంది అనుకుని అధిక మొత్తంలో కొనుగోలు చేసి 1, 2, 3డోసులకుగాను ఒకేసారి తీసుకుని వెళ్ళటం వల్ల ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. ఈనెలలో వెయ్యాల్సిన ఎరువుమాత్రమే తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.


రీవెరిఫికేషన్‌లో పెన్షన్ల మార్పు

చెరుకుపల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలంలో సదరం రీవెరిఫికేషన్‌లో 40శాతం లేదా అంతకన్నా ఎక్కువ శాతం తాత్కాలిక వైకల్యం కలిగి ఉన్న పెన్షనర్ల కి సెప్టెంబర్ 1వ తేదీన పెన్షన్ యథావిధిగా వస్తుందని 60సంవత్సరాలు నిండిన 92మంది పెన్షన్లు వృద్ధాప్య పెన్షన్‌గా మార్పు చేశారని, ఆరుగురికి వితంతు పెన్షన్లు మంజూరు చేశారని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని ఒక ప్రకనటనలో తెలిపారు.

రైలు ఢీకొని తండ్రి, కొడుకు మృతి

● సొంతూరు బాపట్ల జిల్లా గుడ్డికాయలంక

● కొంతకాలంగా పాయకరావుపేటలో నివాసం




బొర్రా అనిల్, గుణశేఖర్ (ఫైల్)

పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట వద్ద తాండవ నదిపై ఉన్న రైల్వే వంతెన మీదుగా నడుచుకుంటూ వెళుతున్న తండ్రి, కొడుకును రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలను తుని ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు గురువారం వెల్లడించారు. ఈ విధంగా ఉన్నాయి. బాపట్ల జిల్లా రేపల్లె మండలం గుడ్డికాయలంక గ్రామానికి చెందిన బొర్రా అనిల్ (36), జనని ప్రేమ వివాహం చేసుకుని, కొంత కాలం నుంచి అనకాపల్లి జిల్లా పాయకరావుపేట లింగాలతోట కాలనీలో నివాసం వుంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె వున్నారు. మద్యానికి బానిస అయిన అనిల్.. రోజూ తాగివచ్చి భర్యతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో 26వ తేదీన భార్యతో గొడవ పడిన అనిల్... కుమారుడు గుణశేఖర్(8)ను వెంటబెట్టుకుని రేపల్లె వెళ్లేందుకు తునిలో రైలు ఎక్కడం కోసం తాండవ నదిపై ఉన్న రైల్వే వంతెన మీదుగా నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో రైలు ఢీకొనడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. బుధవారం రైల్వే వంతెన వద్ద గుణశేఖర్ మృతదేహం కనిపించింది. తన భర్త కనిపించడంలేదని జనని ఇచ్చిన ఫిర్యాదుపై పాయకరావుపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. రైల్వే వంతెన కింద గాలింపు చర్యలు చేపట్టగా, కొంతదూరంలో అనిల్ మృతదేహం లభించింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తుని ప్రభుత్వ రైల్వే పోలీసులు తెలిపారు.

గణేష్ మహరాజ్‌కీ జై




తెనాలి: రజకపేటలో ఆంజనేయ గణపతి




గుంటూరు: కాకుమానువారితోటలో ఏర్పాటు చేసిన గణనాథుడు



కర్లపాలెం: పాపిరెడ్డిపాలెంలో కొలువుతీరిన వినాయకుడు



గుంటూరు: ఏలూరు బజారులో పుష్పాల అలంకరణలో కొలువు దీరిన గణనాథుడు



పొన్నూరు: కాళింద మర్ధన కృష్ణ అలంకారంలో కొలువైన గణనాథుడు



తుళ్లూరులో ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన గణనాథుడు




తాడేపల్లి: ఉండవల్లిలో కొలువైన ఎకో ఫ్రెండ్లీ (మట్టి) గణపతి

విద్యుత్ కాంతులు, సంప్రదాయాలు ఉట్టిపడేలా, సినీ సెట్టింగ్‌లను మరిపించేలా ఏర్పాటు చేసిన మండపాల్లో వినూత్న రూపాల్లో గణనాథులు భక్తులకు దర్శనమిచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకుని గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలతో పాటు వివిధ పట్టణాలు, పల్లెల్లో భారీ గణపతులు కొలువుతీరగా భక్తులు దర్శనాలకు పోటెత్తారు. గణపతి బప్పామోరియా, జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అన్న నినాదాలతో మండపాలు మారుమోగాయి.



పాతమంగళగిరి జీఆర్ స్కూల్ వద్ద కొలువైన గణనాథుడు



తాడికొండ: నిడుముక్కలలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం



గుంటూరు నల్లచెరువు, 6వ లైన్లో కొలువుదీరిన గణనాథుడు



నరసరావుపేట: కోటప్పకొండ రోడ్డులో ఏర్పాటుచేసిన మట్టి విగ్రహం

మురుగు ఉండదు.. నీరు కనిపించదు

- నాలుగు గ్రామాల్లో మేజిక్ డ్రెయిన్‌లు
- మురుగునీరు భూమిలో ఇంకిపోయే వ్యవస్థ
- కొలకలూరు బీసీ కాలనీలో పైలట్ ప్రాజెక్టు
- చింతలపూడి, మంగళగిరిపాడు, తిక్కిరెడ్డిపాలెం ప్రతిపాదనల నివేదన

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డ్రెయిన్ల నిర్మాణం, నిర్వహణ పంచాయతీలకు భారంగా మారుతుండటంతో ఉపాధి హామీ పథకం కింద మేజిక్ డ్రెయిన్లను నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది. తక్కువ ఖర్చు, జీరో మెయిన్‌టెనెన్స్, నీరు ఎక్కడికక్కడ ఇంకిపోయే ప్రయోజనాలు ఉండటంతో తొలుత నాలుగు గ్రామాల్లో అక్టోబరు 2వ తేదీ నాటికి నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటికే తెనాలి మండలంలోని కొలకలూరు బీసీ కాలనీలో పైలట్ ప్రాజెక్టుగా 160 మీటర్ల మేజిక్ డ్రెయిన్‌ని నిర్మించారు. దుగ్గిరాల మండలంలోని చింతలపూడి, మేడికొండూరులోని మంగళగిరిపాడు, ప్రత్తిపాడులోని తిక్కిరెడ్డిపాలెంలోనూ మేజిక్ డ్రెయిన్లను ప్రతిపాదనలను పంపించారు. వీటి పనులు కూడా త్వరలోనే ప్రారంభమౌతాయని అధికారవర్గాలు తెలిపాయి.

మేజిక్ డ్రెయిన్‌లు అంటే...

మేజిక్ డ్రెయిన్లను ఇరుకుగా ఉండే రోడ్లలో నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తారు. అర మీటర్ వెడల్పు, రెండు మీటర్ల లోతు ఉపాధి హామీ లేబర్ కాంపొనెంట్ కింద మట్టి పని చేయిస్తారు. ఆ తర్వాత 75 ఎంఎం ఓటీజీ రాయితో లేయర్ వేస్తారు. రెండో లేయర్ 40 ఎంఎం మెటల్, మూడో లేయర్ 20 ఎంఎం మెటల్‌లతో లేయర్ నిర్మిస్తారు. ప్రతీ 30 మీటర్లకు ఒక ఇంకుడు గుంట కూడా ఈ మేజిక్ డ్రెయిన్‌లోనే నిర్మాణం చేస్తారు. అందులోకి వచ్చిన నీరు భూమిలోకి ఇంకిపోయేలా నాలుగు లేయర్ల రాక్, మెటల్‌తో నిర్మిస్తారు. ప్రతీ వీధి చివరన ఒక పెద్దగుంతని కూడా తవ్వుతారు. వీటి వలన ఇళ్లల్లో ఉత్పత్తి అయ్యే నీటితో పాటు వర్షం కురిసిన సమయంలో వచ్చే వరదనీరు కూడా తేలికగా భూమిలోకి ఇంకిపోయి భూగర్భ జల మట్టాన్ని పెంచుతుంది.

నిర్వహణ... పారిశుధ్యం సులభతరం

మేజిక్ డ్రెయిన్ నిర్వహణ పెద్దగా ఉండదు. దీని వలన పారిశుధ్యం గణనీయంగా మెరుగుపడుతుంది. ఏడాదికి ఒకటి/రెండుసార్లు మాత్రం మేజిక్ డ్రెయిన్‌లో ఏర్పడే మట్టి, చెత్త, చెదారాలను తొలగిస్తే సరిపోతుంది. ఈ డ్రెయిన్ల వలన ఇళ్ల మధ్యన మురికికూపాలు ఏర్పడే అవకాశం ఉండదు. దాంతో ప్రజలు అంటువ్యాధుల బారినపడే ప్రమాదం అసలే ఉండదని అధికారవర్గాలు తెలిపాయి. మహాత్మాగాంధీ జయంతి నాటికి జిల్లాకు కేటాయించిన నాలుగు గ్రామాల్లో మేజిక్ డ్రెయిన్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకొన్నారు.



మేజిక్ డ్రెయిన్

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

- తొలి రోజు 932 మందికి పూర్తి
- 28 కమిటీలతో ప్రత్యేక ఏర్పాట్లు

గుంటూరు (విద్య) ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో టీచర్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం గుంటూరు నగరంలోని ఆంధ్ర క్రిస్టియన్ (ఏసీ కళాశాలలో) ప్రారంభమైంది.



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

సర్టిఫికెట్ల పరిశీల కోసం విద్యాశాఖ మొత్తం 28 కమిటీలను ఏర్పాటు చేసింది . ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పరిశీలన కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగింది. తొలుత కొన్ని సాంకేతిక కారణాలవల్ల వల్ల పరిశీలన ఆలస్యమైనప్పటికీ మధ్యాహ్నం నుంచి ఊపందుకుంది. మెగా డీఎస్సీలో ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన మొత్తం 1143 మంది అభ్యర్థులకు గాను తొలిరోజు 932 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పూర్తి చేసినట్లు డీఈఓ సీవీ రేణుక వెల్లడించారు.మొత్తం 28 కమిటీల్లో ఒక్కో కమిటీకి 50 మంది అభ్యర్థులను కేటాయించి పరిశీలన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. ఇలా ఉంటే సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమానికితి ఆర్జీడీ లింగేశ్వర్ రెడ్డి తో పాటు బాపట్ల డీఈఓ పురుషోత్తం ,పల్నాడు డీఈవో చంద్రకళ తో పాటు ఎంఈఓ లు హాజరయ్యారు.



కమిటీ వద్ద సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకుంటున్న డీఎస్సీ అభ్యర్థి

కేంద్రం బయట అభ్యర్థుల బంధువుల కోలాహలం

మెగా డీఎస్సీ సర్టిఫికెట్ పరిశీలనకు వచ్చిన అభ్యర్థులతో పాటు వారి బంధువులు, కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఏసి కళాశాలలోని సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రం వద్ద కోలాహలం నెలకొంది. కొంతమంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలన కోసం కేంద్రంలోకి వెళ్తూ పిల్లల్ని కుటుంబ సభ్యులు, బంధువులు వద్ద వదిలి వెళ్లారు. భార్యాభర్తల్లో ఒకరికి, ఉద్యోగం రాగా మరొకరు పిల్లల్ని సముదాయించుకుంటూ కేంద్రం కేంద్రం వద్ద కనిపించారు. భార్యాభర్తలిద్దరికీ ఇద్దరికీ ఉద్యోగాలు వచ్చినవారు పిల్లల్ని కుటుంబ సభ్యులకు అప్పగించి వెళ్ళడం కనిపించింది.

దరఖాస్తు చేయకుంటే మీ సంగతి చూస్తాం

- అసోసియేషన్ నేతలతో ఎక్సైజ్ అధికారుల హెచ్చరికలు
- బార్లకు నేటితో ముగియనున్న గడువు.. వ్యాపారులతో చర్చలు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బార్లకు పెద్దఎత్తున దరఖాస్తులు చేయండి.. లేకపోతే మీ సంగతి చూస్తాం అంటూ ఎక్సైజ్ అధికారులు మద్యం అసోసియేషన్ నాయకులను బెదిరించారని సమాచారం. బార్ల లైసెన్సులకు గడువు పొడిగిస్తున్నా దరఖాస్తు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. తాజాగడువు శుక్రవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో గురువారం గుంటూరులోని ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం అసోసియేషన్ నాయకులతో అధికారులు చర్చలు జరిపారు. బార్ల పాలసీ నష్టంచేకూరేలా ఉందంటూ, అందుకే తాము దరఖాస్తు చేయలేకపోతున్నామని అసోసియేషన్ నాయకులు అధికారులకు తెలిపారు. అదేం కుదరదు మీరు విరివిగా బార్లకు దరఖాస్తు చేయకపోతే.. వైన్ షాపులను ఏవిధంగా నిర్వహిస్తారో చూస్తామంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారని తెలిసింది. అసోసియేషన్ గుమస్తా మణికుమార్‌ను విజయవాడ ఎస్టీఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకుని బెదిరించినట్లు తెలిసింది. బార్లకు దరఖాస్తులు చేయకపోతే వైన్ షాపులపై కేసులు పెడతామని హెచ్చరించినట్లు సమాచారం. నిబంధనలను కఠినతరం చేస్తామని తేల్చిచెప్పినట్లు తెలిసింది. అయినా కూడా తాము ఏమీ చేయలేమని.. ప్రస్తుత పాలసీ తీవ్రంగా నష్టాలు వచ్చేటట్లుగా ఉందని.. బార్లకు దరఖాస్తు చేయలేమని అసోసియేషన్ నాయకులు అధికారుల ఎదుట స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో బార్లకు దరఖాస్తు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాకపోతే ఏమి చేయాలంటూ అధికారులు తల పట్టుకుంటున్నారు.

తెలుగు వెలుగు మసకబారుతుందా..?!

- తెలుగు భాషాభిమానులు ఆందోళన
- భాషాభివృద్ధికి ప్రభుత్వాలు పూనుకోవాలి
- నేడు తెలుగు భాషా దినోత్సవం

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దేశభాషలందు తెలుగు లెస్స. అని విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు తెలుగుభాష ఔన్నత్యాన్ని కీర్తించారు. మహోజ్వలమైన సాహిత్యంతో తెలుగుభాష విశ్వఖ్యాతిని పొందింది. పద్యంతో ఏ భాషకు లేని విశిష్టత తెలుగుభాష సొంతం చేసుకుంది.. అవధాన ప్రక్రియ తెలుగుభాషకే సొంతం.. వేల ఏండ్ల ఘన చరిత్రగల తెలుగుభాష వెలుగులు ఇంగ్లీషు ధాటికి, ఇంటర్నెట్ తాకిడికి మసకబారుతుందా? అంటే భాషావేత్తలు అవుననే చెబుతున్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియం ఎత్తివేయడం భాష మనుగడకు గొడ్డలి పెట్టని భాషాభిమానులు చెప్తున్నారు. కూటమి ప్రభుత్వం పాఠశాలలో తెలుగు మీడియంను పునరుద్ధరిస్తుందని అనుకున్న భాషవేత్తల ఆశలు అడియాశలయ్యాయి. ప్రభుత్వాలు పూనుకుని తెలుగు భాషాభివృద్ధికి చర్యలు తీసుకోకపోతే భాష మనుగడ ప్రశ్నార్థకం అవుతుందంటున్నారు.

ప్రభుత్వాలు పూనుకోవాలి



● డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి

ఏ భాష అయినా ప్రచారంలో ఉండాలంటే, సజీవ భాషగా నిలవాలంటే మొదటగా దానిని ఆదరించాల్సింది ప్రభుత్వమే. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేసి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తుందన్న నమ్మకం ఉంది.

తెలుగుభాష అభ్యున్నతికి మాన్‌సింగ్ నాయక్ కృషి



కారంపూడి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష అభ్యున్నతికి మాన్‌సింగ్‌నాయక్ విశేషంగా కృషి చేస్తున్నారు. బొల్లాపల్లి మండలం హనుమాపురంనకు చెందిన బాణావత్ మాన్‌సింగ్‌నాయక్ కారంపూడిలో ఎంపీపీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తెలుగుభాషను బతికించాలనే లక్ష్యంతో గేయాలు, కథలు చిన్నచిన్న పుస్తకాలు ప్రచురించి విద్యార్థులకు అందిస్తున్నారు. సుమారు 2వేల పుస్తకాలను సేకరించి పాఠశాలలో గ్రంథాలయం కూడా ఏర్పాటుచేశారు. మాన్‌సింగ్ నాయక్ సేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ సర్వశిక్ష అభియాన్ 2021లో చదవడం మాకిష్టం అనే పథకం కింద జిల్లా కోఆర్డినేటర్‌గా ఎంపిక చేశారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీకి ఉమ్మడి గుంటూరు జిల్లా ఎక్స్‌పర్ట్ టీచర్‌గా ఎంపిక చేశారు.

హద్దులు దాటిన యూరియా దందా

(5వ పేజీ తరువాయి)

ఎక్కువగా యూరియా నిల్వలు తెలంగాణకు వెళ్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సరిహద్దు ప్రాంతాల నుంచి వందల టన్నుల యూరియా తెలంగాణకు తరలి వెళ్తుంది. రూ.266.50 యూరియా బస్తాను వ్యాపారులు బోగస్ రైతుల పేర్లతో దళారులకు విక్రయిస్తున్నారు. వారు అదే యూరియాను తెలంగాణకు తీసుకువెళ్లి రూ.850కి విక్రయిస్తున్నారు. ఫలితంగా సకాలంలో ఎరువులు దొరక్క రైతులు అల్లాడి పోతున్నారు. రెండు నెలలుగా పల్నాడు జిల్లా కారంపూడి అడ్డాగా గుట్టుగా సాగుతున్న ఎరువుల దందాను విజిలెన్స్ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం కాంతనపల్లికి చెందిన సఖినాల సురేష్ రెండు నెలలుగా యూరియాను పక్కదారి పట్టిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కారంపూడికి చెందిన నంద్యాల నాగరాజును మధ్యవర్తిగా నియమించుకుని సురేష్ ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. కారంపూడికి చెందిన నీరజ లక్ష్మీవెంకట సత్యనారాయణ కమర్షియల్ కార్పొరేషన్ యజమాని అతుకూరి నరసింహారావు వీరికి సహకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కారంపూడి, మాచర్ల ప్రాంతాలకు చెందిన రైతుల పేర్లతో బిల్లులు రాసి విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. దాచేపల్లి మండలంలోని పొందుగుల చెక్‌పోస్టు వద్ద బుధవారం అర్ధరాత్రి సురేష్, బొలగనా సుధీర్ అనే వ్యక్తులు రెండు వాహనాల్లో తరలిస్తున్న 165 బస్తాల యూరియాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

తెనాలి రైల్వే స్టేషన్‌కు విద్యుత్ కాంతులు

- ప్రయాణికులను ఆకట్టుకుంటున్న విద్యుత్ కాంతులు

తెనాలి అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వే స్టేషన్ ముఖద్వారం విద్యుత్ కాంతుల సోయగం ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. ప్రైవేటు భవనం కాదు ఇది తెనాలి రైల్వే స్టేషన్ అంటూ ప్రయాణికులు మురిసిపోతున్నారు. స్టేషన్ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన అన్ని రంగుల లైట్లు ప్రత్యేక అందాన్ని తెచ్చిపెట్టాయి. ముఖ్యమైన రోజుల్లో మాత్రమే ఈ లైట్లను వెలిగిస్తున్నారు. వినాయక చవితి పర్వదినాన రైల్వే స్టేషన్ ఇలా వెలిగిపోతుంది. మరో పక్క కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ భారత్ పథకంలో రూ.27 కోట్లతో చేస్తున్న పనులు పూర్తయితే తెనాలి రైల్వేస్టేషన్ రాష్ట్రంలోనే ఓ మోడల్‌గా సౌకర్యాలతో ప్రయాణికులను అలరించనుంది.





యూరియా కోసం బారులు

(5వ పేజీ తరువాయి)

యూరియా నిల్వలు ఇప్పటికే సరఫరా చేశాం.. కావాలంటే గణాంకాలే రుజువని వ్యవసాయశాఖ చెబుతోంది. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం భిన్నంగా కనిపిస్తున్నాయి. ఖరీఫ్ అవసరాల్లో ఇప్పటికే దాదాపు 60శాతం యూరియా కేటాయించినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. కానీ రైతులకు మాత్రం వెతలు తప్పడం లేదు. పంపిణీలో అధికశాతం రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా పక్కదారి పడుతుండగా ఇదే అవకాశంగా వ్యాపారులు యూరియాను బ్లాక్‌చేసి సమస్యను తీవ్రం చేస్తున్నారనే విమర్శలున్నాయి. యూరియా కోసం రైతులు ఇబ్బందిపడకూడదని, ఎరువుల అక్రమాలపై విజిలెన్స్ దాడులు ముమ్మరం చేయాలని తాజాగా సీఎం చంద్రబాబు ఆదేశించారు. అయినా వ్యాపారులు యూరియాను బ్లాక్ చేసి విక్రయిస్తున్నారు. 45 కిలోల యూరియా బస్తాను రూ.266లకు అమ్మాల్సి ఉండగా రూ.400 వరకు అమ్ముతూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. కాదంటే నానో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు తీసుకున్న వారికే యూరియా అని మెలిక పెడుతున్నట్లు తెలుస్తోంది.

మునక కారణమెలా...

ఇటీవల కురిసిన వర్షాల ధాటికి అనేక ప్రాంతాల్లో వరి ముంపు బారిన పడింది. దీంతో పైరు కాపాడుకోవడానికి రైతులు రెండోసారి యూరియా వాడాల్సి వచ్చింది. కుళ్లిపోయే దశలో ఉన్న పైరును కాపాడుకోవడానికి రైతులు ఎకరాకి బస్తా యూరియా చల్లాల్సి వచ్చింది. యూరియా ఇక్కట్లకు ఇది కూడా ఒక కారణమని అధికారులు చెప్తున్నారు. అయితే రెండోసారి యూరియా రైతులు వేస్తున్నా కేటాయించిన నిల్వల లెక్కల ప్రకారం సమృద్ధిగానే ఉండాలి తప్ప కొరత ఎందుకొచ్చిందనే దానికి అధికారులే సమాధానం చెప్పాలి.

పరపతి ఉన్నవారికే..

పీఏసీఎస్‌లు, ఆర్ఎస్‌కేల్లో రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా యూరియా అందిస్తున్నారనే విమర్శలున్నాయి. నిబంధనల ప్రకారం రైతులకు పంపిణీ జరగాల్సి ఉండగా, పరపతి గల రైతులకు పెద్దమొత్తంలో యూరియా కేటాయిస్తున్నారు. పలుకుబడి ఉన్న వారు అవసరం లేకపోయినా 20 నుంచి 30 బస్తాలు నాయకుల సిఫార్సుతో తీసుకుంటున్నారు. దీని వల్ల తమ దాకా వచ్చేసరికి కొరత ఏర్పడుతుందని చిన్న, సన్న కారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఏసీఎస్‌లకు నిల్వల కేటాయింపులతోనే అధికారులు సరిపెడుతున్నారు తప్పితే వాటిని రైతులకు చేర్చేవరకు పర్యవేక్షణ లేకుండా పోతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల అయితే ఏకంగా స్థానికంగా ఉన్న నేతలే యూరియా పంపిణీ బాధ్యతలు తీసుకుని తమకు తోచిన విధంగా ఇస్తున్నారు.



గుంటూరు రోడ్‌లోని బ్రిడ్జి వద్ద జరుగుతున్న పూడిక తీత పనులు

చురుగ్గా పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మురుగునీటి పారుదల వ్యవస్థకు ప్రధాన కాలువైన పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ మేరకు స్థానిక గుంటూరు రోడ్‌లోని పోతురాజు కాలువ బ్రిడ్జి వద్ద భారీ ఎక్స్‌కవేటర్‌లను ఏర్పాటు చేసి పూడిక తీత పనులు చేపట్టారు. ఇటీవల వరుసగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలో వర్షం నీరు నిలవకుండా, అలాగే మురుగునీరు పారుదల సక్రమంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనరు వెంకటేశ్వరరావు ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. దీంతో రెండు రోజులుగా పనులు ముమ్మరం అయ్యాయి. అతి త్వరలోనే పోతురాజు కాలువలో పూడిక తీత పనులు పూర్తి స్థాయిలో చేపట్టి నగరంలో మురుగునీటి పారుదల వ్యవస్థకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు.



హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

హాస్టల్‌ను శుభ్రంగా ఉంచాలి

● సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హాస్టల్లో శుభ్రత లేకపోవడంపై సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నాగులవరం రోడ్డులోని ఏపీ ట్రైబల్ హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. హాస్టల్‌లో గిరిజన బాలికలకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి రూమ్‌లలో ఫ్యాన్లు లేవని, శుభ్రత పాటించటం లేదని గమనించి వార్డెన్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్నానాల గదులు, పరిసరాల ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. బాలికలతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో మమేకమై చదువులో ఎలా ఉన్నారో భవిష్యత్‌లో ఏం కావాలని కోరుకుంటున్నారో తెలుసుకున్నారు. కష్టపడి, క్రమశిక్షణతో చదువుకొని ఎదగాలని త్రివినాగ్ బాలికలకు సూచించారు.



బంకు వద్ద కేసు రాస్తామంటూ బెదిరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఎక్సైజ్ సిబ్బంది దందా

తర్లుపాడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు బెల్టు షాపుల వద్ద, టీ బంకుల వద్ద తాగుతున్న మందు బాబుల నుంచి పొదిలి ఎక్సైజ్ శాఖ సిబ్బంది వసూళ్ల దందాకు పాల్పడుతున్నారు. తర్లుపాడులో ఒక బంకు వద్ద మందు తాగుతున్న ఇద్దరిపై కేసు రాస్తామంటూ అంటూ బెదిరించారు. విషయం తెలుసుకున్న విలేకరి అక్కడకు వెళ్లి ఫొటో తీస్తుండగా వారు మెల్లగా జారుకున్నారు. సీఐ కారు డ్రైవర్, కానిస్టేబుల్ ఈ వ్యవహారానికి పాల్పడినట్లు తెలిసింది. గంట తర్వాత మరలా బంకు వద్దకు ఎక్సైజ్ సీఐ, సిబ్బంది వచ్చి బంకు నిర్వాహకురాలికి మేము ఇక్కడికి రాలేదని చెప్పాలని హుకుం జారీ చేశారు. లేదంటే కేసు నమోదు చేస్తామని బెదిరించినట్లు సమాచారం. మండలంలో యథేచ్ఛగా బెల్టు షాపుల నిర్వాహకుల వద్ద నుంచి సీఐ కారు డ్రైవర్, కానిస్టేబుల్ నెలనెలా వచ్చి మామూళ్లు తీసుకుంటున్నట్లు తెలిసింది.

గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం

రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక



శ్రీరామ్



వెంకట్రావు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలులో జరిగిన సంఘం రాష్ట్ర మహాసభలో తొమ్మిది మందిని రాష్ట్ర ఆఫీస్‌బేరర్స్‌గా, 17 మందిని కమిటీని ఎన్నుకున్నారు రాష్ట్ర అధ్యక్షుడిగా గంటా శ్రీరామ్, కార్యదర్శిగా పూసపాటి వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా కిలారి పెద్దాబ్బాయి, సహాయకార్యదర్శులుగా ఏవీ కృష్ణారావు, తోట తిరుపతిరావు, పాపిన సాంబమూర్తి, దాసరి జనార్దన్, గోకాడ దేవుడు నాయు డు, కురవ రాముడు, కమిటీ సభ్యులుగా కే ఈశ్వరరావు, ఆర్. అచ్యుతరావు, పోతురాజు, పీవీ ఆంజనేయులు, జి.రామకృష్ణ, బి. ఆంజనేయులు, ఎం. శేషు, డి. శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. మహాసభలోచేసిన తీర్మానాలను గురువారం పత్రికలకు విడుదల చేశారు. గొర్రెల కాపరుల రక్షణ కోసం సామాజిక రక్షణ చట్టాన్ని తేవాలని, ప్రతి గ్రామంలో మేత భూములు, నీటి వసతి కల్పించి వలసలు నివారించాలని, ప్రైవేటు మార్కెట్లో దోపిడీని అరికట్టి ప్రభుత్వమే మార్కెట్ సౌకర్యం కల్పించాలని తదితర తీర్మానాలను చేశారు.

శ్రీశైలం గాయత్రీ పీఠాధిపతిగా రామారావు



వేటపాలెం(చీరాల), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం రావూరిపేటకు చెందిన చల్లా రామారావు శ్రీశైల గాయత్రీ పీఠానికి పీఠాధిపతిగా నియమితులయ్యారు విశ్రాంత ఉపాధ్యాయులు రామారావు జ్యోతిర్విద్వాన్, దేవాంగ పురోహిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షులుగా, దేవాంగ పురాణం గ్రంథకర్తగా పలువురి మన్ననలు పొందారు. ఈ క్రమంలో శ్రీశైలం పీఠం అధిపతిగా నిమితులయ్యారు. ఆయన్ను సభ్యులు లక్ష్మణరావు, బాలశంకరరావు, విశ్వనాథ్ వీరరాఘవులు తదితరులు రామారావును ప్రత్యేకంగా అభినందించారు.

కూటమి పాలనలో పెద్ద ఎత్తున సంక్షేమం,అభివృద్ధి

● విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అద్దంకి, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆధ్వర్యంలో ప్రజాకూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన నాటి నుంచి నియోజకవర్గంలో మొత్తంలో 1,100 మందికి పైగా సీఎంఆర్ఎఫ్ నిధులు అందజేసినట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంతో పాటు మండలంలోని జార్లపాలెంలో పలు కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి రవికుమార్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెద్దఎత్తున సీఎం ఆర్ఎఫ్ నిధులు అందజేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో మరో 500 మందికి త్వరలో చెక్కులను అందజేస్తామన్నారు. గురువారం 35 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి రవికుమార్ అందజేశారు. జార్లపాలెంలో రూ.కోటి వ్యయంతో చేపట్టనున్న జార్లపాలెం-చెరువుకొమ్ముపాలెం తారురోడ్డుకు శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ లు, అద్దంకి-రేణింగవరం రోడ్డు నుంచి దాసుల కాలనీ వరకు రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఎన్‌టీఆర్ సుజల ఆర్‌వో ప్లాంట్ ను ప్రారంభించారు. గ్రామంలో మిగిలిపోయిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లను విద్యుత్ సమస్యలను, మంచినీటి సమస్య తదితర సమస్యలను గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకుపోయి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ముందుగా అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులో హిట్‌జోన్ ఇండోర్ క్రీడాకేంద్రాన్ని, ఒంగోలు రోడ్డులో ఎస్‌వీ కన్వెన్షన్‌ను మంత్రి రవికుమార్ నర్సరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ క్రికెట్ బ్యాటింగ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, టీడీపీ జిల్లా వైద్యవిభాగం అధ్యక్షులు చదలవాడ ఫణీంద్రబాబు, నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, ఎంపీటీసీ సభ్యుడు మలాది కోటేశ్వరమ్మ నటరాజ్, సర్పంచ్ మల్లవరపు సుశీల, యేనుగంటి వెంకట్రామయ్య(బాబు), ధూళిపాళ్ల వీరాస్వామి, భార్గవ, సుబ్రహ్మణ్యం, చిరంజీవి, కౌన్సిలర్ సుభాషిణి లహరి, కుందారపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయ నిధి వరం

21 మందికి చెక్కులు అందజేసిన ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఆపద సమయంలో వైద్యశాలలో చికిత్స పొందిన వారికి వెంటనే స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం సహాయ నిధి సాయాన్ని మంజూరు చేస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం 21 మంది ఆపన్నులకు రూ.17,94,513 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఎరిక్షన్‌బాబు బాధితులకు పంపిణీ చేశారు. వైద్యం చేయించుకున్న పేదకు సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు పాల్గొన్నారు.

మార్కాపురంలో..

మార్కాపురం : మార్కాపురం పట్టణానికి చెందిన 9 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆలస్యం లేకుండా ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తోందన్నారు. సుమారు రూ.9.10 లక్షల విలువ గల చెక్కులను రోగులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గుంటక కృష్ణవేణి, టీడీపీ జిల్లా ప్రధాన



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, కనిగిరి బాలవెంకటరమణ, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ ఇబ్రహీంఖాన్, మేడిద రంగస్వామి, చిట్యాల చంద్రశేఖర్‌రెడ్డి, దూపాటి యలమంద పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు

(5వ పేజీ తరువాయి)

యూరియా నిల్వలు ఇప్పటికే సరఫరా చేశాం.. కావాలంటే గణాంకాలే రుజువని వ్యవసాయశాఖ చెబుతోంది. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం భిన్నంగా కనిపిస్తున్నాయి. ఖరీఫ్ అవసరాల్లో ఇప్పటికే దాదాపు 60 శాతం యూరియా కేటాయించినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. కానీ రైతులకు మాత్రం వెతలు తప్పడం లేదు. పంపిణీలో అధికశాతం రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా పక్కదారి పడుతుండగా ఇదే అవకాశంగా వ్యాపారులు యూరియాను బ్లాక్ చేసి సమస్యను తీవ్రం చేస్తున్నారనే విమర్శలున్నాయి. యూరియా కోసం రైతులు ఇబ్బంది పడకూడదని, ఎరువుల అక్రమాలపై విజిలెన్స్ దాడులు ముమ్మరం చేయాలని తాజాగా సీఎం చంద్రబాబు ఆదేశించారు. అయినా వ్యాపారులు యూరియాను బ్లాక్ చేసి విక్రయిస్తున్నారు. 45 కిలోల యూరియా బస్తాను రూ.266లకు అమ్మాల్సి ఉండగా రూ.400 వరకు అమ్ముతూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. కాదంటే నానో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు తీసుకున్న వారికే యూరియా అని మెలిక పెడుతున్నట్లు తెలుస్తోంది.

మునక కారణమేలా...

ఇటీవల కురిసిన వర్షాల ధాటికి అనేక ప్రాంతాల్లో వరి ముంపు బారిన పడింది. దీంతో పైరు కాపాడుకోవడానికి రైతులు రెండోసారి యూరియా వాడాల్సి వచ్చింది. కుళ్లిపోయే దశలో ఉన్న పైరును కాపాడుకోవడానికి రైతులు ఎకరాకి బస్తా యూరియా చల్లాల్సి వచ్చింది. యూరియా ఇక్కట్లకు ఇది కూడా ఒక కారణమని అధికారులు చెప్తున్నారు. అయితే రెండోసారి యూరియా రైతులు వేస్తున్నా కేటాయించిన నిల్వల లెక్కల ప్రకారం సమృద్ధిగానే ఉండాలి తప్ప కొరత ఎందుకొచ్చిందనే దానికి అధికారులే సమాధానం చెప్పాలి.

పరపతి ఉన్నవారికే..

పీఏసీఎస్‌లు, ఆర్ఎస్‌కేల్లో రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా యూరియా అందిస్తున్నారనే విమర్శలున్నాయి. నిబంధనల ప్రకారం రైతులకు పంపిణీ జరగాల్సి ఉండగా, పరపతి గల రైతులకు పెద్దమొత్తంలో యూరియా కేటాయిస్తున్నారు. పలుకుబడి ఉన్న వారు అవసరం లేకపోయినా 20 నుంచి 30 బస్తాలు నాయకుల సిఫార్సుతో తీసుకుంటున్నారు. దీని వల్ల తమ దాకా వచ్చేసరికి కొరత ఏర్పడుతుందని చిన్న, సన్న కారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఏసీఎస్‌లకు నిల్వల కేటాయింపులతోనే అధికారులు సరిపెడుతున్నారు తప్పితే వాటిని రైతులకు చేర్చేవరకు పర్యవేక్షణ లేకుండా పోతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల అయితే ఏకంగా స్థానికంగా ఉన్న నేతలే యూరియా పంపిణీ బాధ్యతలు తీసుకుని తమకు తోచిన విధంగా ఇస్తున్నారు.

హద్దులు దాటిన యూరియా దందా

(5వ పేజీ తరువాయి)

ఎక్కువగా యూరియా నిల్వలు తెలంగాణకు వెళ్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సరిహద్దు ప్రాంతాల నుంచి వందల టన్నుల యూరియా తెలంగాణకు తరలివెళ్తుంది. రూ.266.50 యూరియా బస్తాను వ్యాపారులు బోగస్ రైతుల పేర్లతో దళారులకు విక్రయిస్తున్నారు. వారు అదే యూరియాను తెలంగాణకు తీసుకువెళ్లి రూ.850కి విక్రయిస్తున్నారు. ఫలితంగా సకాలంలో ఎరువులు దొరక్క రైతులు అల్లాడి పోతున్నారు. రెండు నెలలుగా పల్నాడు జిల్లా కారంపూడి అడ్డాగా గుట్టుగా సాగుతున్న ఎరువుల దందాను విజిలెన్స్ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం కాంతనపల్లికి చెందిన సఖినాల సురేష్ రెండు నెలలుగా యూరియాను పక్కదారి పట్టిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కారంపూడికి చెందిన నంద్యాల నాగరాజును మధ్యవర్తిగా నియమించుకుని సురేష్ ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. కారంపూడికి చెందిన నీరజ లక్ష్మీవెంకట సత్యనారాయణ కమర్షియల్ కార్పొరేషన్ యజమాని ఆతుకూరి నరసింహారావు వీరికి సహకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కారంపూడి, మాచర్ల ప్రాంతాలకు చెందిన రైతుల పేర్లతో బిల్లులు రాసి విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. దాచేపల్లి మండలంలోని పొందుగుల చెక్‌పోస్టు వద్ద బుధవారం అర్ధరాత్రి సురేష్, బొలగాని సుధీర్ అనే వ్యక్తులు రెండు వాహనాల్లో తరలిస్తున్న 165 బస్తాల యూరియాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

గోనుగుంట దేవాలయ ప్రాశస్త్యాన్ని కాపాడాలి

● ఎమ్మెల్యే బీఎన్

● ఘనంగా రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

చీమకుర్తి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : పురాణ ప్రాశస్త్యం కలిగిని గోనుగుంట గ్రామంలోని గంగా పార్వతీసమేత రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి నూతన పాలకమండలి కృషి చేయాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారమహోత్సవ కార్యక్రమాన్ని గురువారం స్థానిక దేవాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు. అనంతరం ఈవో రజని నూతనంగా నియమితులైన పాలకమండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా మలినేని కోటేశ్వరరావు, డైరెక్టర్లుగా అన్నం కమల, సాదు సరోజనమ్మ, దర్శి అంకమ్మ, పాలకేటి రాజ్యలక్ష్మి, కోటు గరటయ్య, వెంపరాల మోహనరావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పూజారి చదలవాడ ప్రదీప్, ఇన్‌స్పెక్టర్ వేణు, టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, పూనాటి వెంకట్రావు, పాలడుగు వెంకటనారాయణ,



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

ఎనికపాటి లక్ష్మీనరసయ్య, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, రావిపాటి రాంబాబు, వెంపరాల ఆంజనేయులు, నల్లూరి మధు, మలినేని ప్రసాద్, సర్పంచ్ సాధు మోహనరావు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలపై విచారణ

చినగంజాం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో



కడవకుదురులో విచారణ చేస్తున్న చీరాల డీఎల్‌డీవో పద్మావతి

ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిపై డీఎల్‌డీవో పద్మావతి విచారించారు. కడవకుదురు గ్రామంలో 2021 సంవత్సరం నుంచి 2024వ సంవత్సరం వరకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన కొమ్ము సుబ్బారావుపై టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు బేతపూడి సురేష్ బాబు, టీడీపీ నాయకులు కనపర్తి వీరాస్వామి, పర్చూరు నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి దేవతోటి నాగరాజులు ఈ నెల 4న కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించారు. మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బారావు, గ్రామ సర్పంచ్ జి.శివకుమారి, జి.రామకృష్ణారెడ్డిలను ఆమె విచారించారు. రికార్డులను, మస్టర్లలను పరిశీలించారు. విచారణ వివరాల నివేదికను కలెక్టర్ వెంకటమురళికి నివేదించనున్నట్లు డీఎల్‌డీవో తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీ.హెచ్.పూర్ణచంద్రరావు, ఏపీవో లక్ష్మిదేవీలు పాల్గొన్నారు.



నిడమానూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న వైస్‌చైర్మన్ విజయకుమార్

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి మేలు

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ విజయకుమార్

ఒంగోలు కలెక్టరేట్/నాగులుప్పలపాడు/ ఒంగోలు(రూరల్) ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి మేలు కలుగుతుందని రైతు సాధికార సంస్థ ఎగ్జి క్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పల్నాడు, గుంటూరు, బాపట్ల, నెల్లూరు జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణీ ప్రకృతి వ్యవసా య క్షేత్రాలను చూపించారు. ముందుగా నా గులుప్పలపాడు మండలం బి.నిడమానూరు గ్రామానికి చెందిన ఎం.అనుపమ ఏడు ఎక రాల్లో చేపట్టిన ప్రకృతి పంటల సాగును ప రిశీలించారు. పోతవరం గ్రామంలో శేషారావు మొక్కజొన్న క్షేత్రాన్ని సందర్శించారు. అనంత రం రైతు సేవా కేంద్రంలో విజయకుమార్ రై తులతో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో చ ర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి తక్కువగా ఉంటుందని చెప్పారు. రైతుల ఖర్చులు తగ్గి మంచి లాభాలు వస్తాయన్నారు. అనంతరం ఒంగోలు మండలం కొప్పో లులో మాధురి డ్రైప్యాడీ క్షేత్రాన్ని సందర్శించారు. అలాగే స్థానిక కలెక్టరేట్‌లోని సీపీవో హాలులో సౌత్‌కోస్టల్‌లోని ఐదు జిల్లాల ప్రాజె క్టు మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వ హించారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్ళేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో సీనియర్ టీఎల్ గోపీచంద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పత్తిపై దిగుమతి సుంకం రద్దుకు పోరాటం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పత్తి దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం రద్దుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సంయుక్త కిసాన్‌మోర్చా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చాను. ఒంగోలులోని మాదాల నారాయణభవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రైతు సంఘాల సంయుక్త కిసాన్‌మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు తాళ్ళూరు, ముండ్లమూరు మండలాల్లో ఈనెల 30,31 తేదీల్లో, వచ్చేనెల 1న మార్కాపురం ఆర్డీవో కార్యాలయం, వచ్చేనెల 2న ఒంగోలులోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వడ్డె హనుమారెడ్డి, డి. జయంతిబాబు, కె.వీరారెడ్డి, ఎస్.లలితకుమారి, కె.హనుమంతరావు, ఆర్.మోహ న్, వి.బాలకోటయ్య, ఎన్.హనుమంతరావు, పరిటాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు ఒంగోలులో జాబ్‌మేళా

ఒంగోలు నగరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 30వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.రమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, హీరో మోటార్ కార్ప్, ఎంఆర్ఎఫ్, రిలయన్స్, జియో ఇన్‌ఫోకామ్ లిమిటెడ్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. మెషిన్ ఆపరే టర్, ప్రొడక్షన్ ట్రైనీ, అసెంబ్లింగ్ ఆపరేటర్, జియో ఫైబర్ ఇంజనీర్, మేనేజర్ తదితర పోస్టుల భర్తీకి మేళా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. టెన్త్, ఐటీఐ, ఇం టర్, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసిన వారు హాజరుకావాలని, ఎంపికైన వారికి రూ. 10వేల నుంచి రూ.19,500ల వరకు నెలవారి వేతనం ఉంటుందన్నారు. 18-35 సంవత్సరాల వయస్సు మధ్య గల అభ్యర్థులు ఆధార్‌కార్డుతో పాటు విద్యార్హతల జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం 10 గం టల నుంచి జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని ఆమె కోరారు.

నేత్రదానంతో అంధులకు చూపు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి సహజ మరణం తరువాత నేత్రదానం చేయడం ద్వారా అంధులకు దృష్టిదానం చేయవచ్చని ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకు నిర్వాహకులు రాజన్న బుధవారం పేర్కొన్నారు. ఒంగోలు లోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అనుబంధంగా ఐ బ్యాంకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సందర్భంగా స్థానిక మంగమూరురోడ్‌కు చెందిన పంగులూరి రా మారావు తన తల్లి శేషమ్మ మరణించడంతో ఆమె నేత్రాలను దానం చేశారని తెలిపారు. న్యాయవాది పంగులూరి గోవిందయ్య, ఎస్‌వీ.రంగారెడ్డి, దామా శ్రీని వాసులు, జి.నాగేశ్వరరావు, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీను పాల్గొన్నారు.

డీఎస్సీ పోస్టుల ఎంపికకు మరో అవకాశం ఇవ్వాలి

ఒంగోలు విద్య, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థులకు పోస్టును ఎంపిక చేసుకునేందుకు మరో అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.మల్లికార్జునరావు, టి.దిలీప్‌చక్రవర్తి గురువారం ఒక ప్రక టనలో కోరారు. అభ్యర్థులకు ఈ అవకాశం కల్పించి వారికి న్యాయం చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు.

చెక్ బౌన్స్ కేసులో శిక్ష

టంగుటూరు (కొండపి), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కందులూరు గ్రామానికి చెందిన కుంచాల నాగార్జున అదే గ్రామానికి చెందిన మొలకలపల్లి లక్ష్మీనారాయణకు డబ్బులు బాకీ ఉండగా, నాగార్జున చెక్ ఇచ్చాడు. చెక్ బౌన్స్ అయినా ఎంతకీ బాకీ చెల్లించకపోవడంతో లక్ష్మీనారాయణ కోర్టులో కేసు వేశారు. నేరం రుజువు కావడంతో ఒంగోలులోని ఎక్సైజ్ కోర్టు నిందితుడికి రూ.2లక్షలు జరిమానా, రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. ఆ మేరకు న్యాయాధికారి కో మలివల్లి తీర్పునివ్వగా నేరస్తుడిని ఒంగోలు జైలుకు రిమాండ్‌కు తరలించారు.

స్వామిత్వ సర్వే పరిశీలన

కొండపి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కొండపి గ్రామ పంచాయతీలోని కట్టావారిపాలెంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను ఇన్‌చార్జి ఎంపీడీవో పి.రామకృష్ణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొండపి గ్రామ సచివాలయం-2లో సర్వేలో పాల్గొంటున్న సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తప్పులు లేకుండా చేయాలని సిబ్బందికి సూచించారు.

గ్రానైట్ లారీ బోల్తా

సంతనూతలపాడు, ఆగ స్టు 28(ఆంధ్రజ్యోతి): ఎం డ్లూరు డొంకవద్ద బుధవారం అర్ధరాత్రి వైట్‌స్టోన్ గ్రానైట్ లోడుతో బద్వేలు నుంచి గు ళ్లాపల్లి వెళ్తున్న లారీ ప్రమా దవశాత్తు బోల్తాపడింది. లారీ తొలుత ముందున్న 108 వాహనాన్ని ఢీకొట్టి ప క్కనే ఉన్న డైనేజీ కాలువ, సగం రోడ్డుపై పడింది. గురువారం ఉదయం పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించి పోవడంతో పోలీసులు క్రేన్‌సాయంతో రోడ్డుపై పడిన గ్రానైట్ లారీని పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

ఘనంగా అమరావతి క్వాంటమ్ ర్యాలీ

సంతనూతలపాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు డొంకవద్ద నున్న ఆర్‌జీయూకేటీ ఒంగోలు క్యాంపస్‌లో గురువారం అమరావతి క్వాంటమ్ ర్యాలీ హ్యాకథాన్-2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో ఐబీఎం, టీసీఎస్, క్యూకిషి వంటి పరిశ్రమల భాగస్వాముల మద్దతుతో విద్యార్థులకు క్వాంటం ఫస్ట్ టెక్నాలజీని ఉపయోగిం చి వాస్తవ సమస్యలను పరిష్కరించే హ్యాకథాన్ వేదికను కల్పించినట్లు ఏవో చం ద్రశేఖర్ తెలిపారు.

అవీ..ఇవీ..

విద్యతోనే వ్యక్తిత్వ వికాసం



విద్యార్థులతో ఉపాధ్యాయులు, ప్రతినిధులు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యనభ్యసించడం ద్వారానే ఉన్నత వ్యక్తిత్వం అలవడుతోందని వేటపాలెం బాలికోన్నత పాఠశాల హెచ్ఎం సరోజిని అన్నారు. చీరాల శ్రీరామకృష్ణ సేవాసమితి గురువారం ప్రతినిధులు వేటపాలెం బాలికోన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేశారు. మూడు మాసాలు పాటు సహకారం అందించనున్నట్లు చెప్పారు. అలాగే స్వామి వివేకానంద జీవిత సందేశం పుస్తకాలను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరోజని, సమితి సెక్రటరీ వివిఎన్ మూర్తి, వేణుగోపాలరావు, మధు, శ్రావణి, సరళదేవీ, వసుధ కుమారి, సుధారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై భారం

● వామపక్షాల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞాదినం



ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్షాల నేతలు

చీరాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఛార్జీల భారం, స్మార్ట్ మీటర్ల నిర్వహణ, ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా చీరాలలో వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞదినం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బషీర్‌బాగ్‌లో అసువులు బాసిన విద్యుత్ అమర వీరుల స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఉద్యమిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ పంపిణీ, నిర్వహణ వ్యవస్థలు ప్రైవేటు సంస్థలకు అప్పగించడంపై మండి పడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాబురావు, వసంతరావు, నారపరెడ్డి, జయరాజ్, సీపీఐ నాయకులు బత్తుల సామ్యేల్, ఫైడియ్య, ప్రజా సంఘాల నేతలు మాచర్ల మోహన్‌రావు, చుండూరి వాసు, గోసాల ఆశీర్వాదం, లక్ష్మీ ప్రసాద్, వెంకటేశ్వర్లు, మోహన్‌కుమారధర్మ పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ అమరవీరులకు నివాళి

మార్టూరు : బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో కాల్పులులో ప్రాణాలు కోల్పోయిన వారికి గురువారం మార్టూరులో పార్టీ కార్యాలయంలో వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాయకులు నివాళులు అర్పించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు, బోడెంపూడి సూరిబాబు, ఎనికపాటి రాంబాబు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

అద్దంకిటౌన్ : ప్రమాదకర స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం అద్దంకి పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో విద్యుత్ సమస్యలపై నాటి పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ వామపక్షల పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ దినం నిర్వహించారు. కార్యక్రమానికి ఏఐటీయూసీ నాయకులు కేఎల్‌డీ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ పోరాటంలో అశువులు బాసిన అమరవీరులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.తిరుపతిరెడ్డి, వివిధ సంఘాల నాయకులు ఆదాం, ఉసురుపాటి శామ్యూల్, టోటా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాల మధ్య కొట్లాట

● ఐదుగురిపై కేసు నమోదు

బల్లికురవ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొణిదెన ఎస్సీ కాలనీలో పాతకక్షల నేపథ్యంలో బుధవారం ఇరు కుటుంబాల మధ్య కొట్లాట జరిగింది. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. అందిన సమాచారం మేరకు గెల్లా దేవేంద్ర, ఆశోక్‌లకు మధ్య పాత గొడవలు ఉన్నాయి. వినాయక చవితి సందర్భంగా మద్యం సేవించిన ఆశోక్ ఘర్షణకు దిగారు. ఘర్షణ మధ్యలో వచ్చిన దేవేంద్ర బంధువు కోటేశ్వరరావుకు కత్తి తగిలి గాయమైంది. వెంటనే క్షతగాత్రుడిని గుంటూరు వైద్యశాలకు తరలించారు. దేవంద్ర ఫిర్యాదు మేరకు ఆశోక్ మరో నలుగురిపై ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేశారు. ఆశోక్ ఒంగోలు వైద్యశాలకు చేరి అక్కడ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అక్కడి నుంచి కూడా ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేసి విచారిస్తామని పోలీసులు తెలిపారు.

హెచ్ఐవీ నిర్మూలనకు కృషి చేద్దాం

● లింక్‌వర్కర్‌స్కీమ్ ప్రతినిధి విజయశ్రీ

పంగులూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):హెచ్ఐవీ వ్యాధిపట్ల అవగాహన పెంచడంద్వారా వ్యాధినిర్మూలన లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్‌వర్కర్‌స్కీమ్ ప్రతినిధి విజయశ్రీ అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామ ఒకేషనల్ జూనియర్ కళాశాల, పీఎస్ఎన్‌సీసీ ఉన్నతపాఠశాల విద్యార్థులతో పాటు జాగర్ల మూడివారిపాలెం గ్రామంలోని మహిళాగ్రూప్ సభ్యులకు హెచ్ఐవీపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసురక్షిత లైంగిక సంబంధాలు, హెచ్ఐవీతో కలుషితమైన సూదులు, సిరంజీల వినియోగం, పరీక్షించని రక్తమార్పిడి ద్వారా హెచ్ఐవీ వ్యాప్తి చెందుతుందన్నారు. హెచ్ఐవీ సోకినప్పటికీ, గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు హెచ్ఐవీ వ్యాధిసోకకుండా నివారించవచ్చన్నారు. హెచ్ఐవీతో పాటు డ్రగ్స్ బారిన పడకుండా యువతలో అవగాహన పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, ఉన్నతపాఠశాల హెచ్ఎం. ప్రసాద్, ఏఎన్ఎం రామాంజమ్మ, పాఠశాల, కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళాగ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మార్టూరు, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుగారిపాలెంలో, కోనంకిలోని సమతానగర్‌లోని ప్రాథమిక పాఠశాలను వేర్వేరుగా ఎంఈవోలు వస్రాంనాయక్, కే.ప్రేమలతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వేడిగా అన్నంపెట్టాలని, విద్యార్థులను కూర్చోబెట్టి భోజనం పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.




పర్చూరులో రామాలయం వద్ద జయంతి కాలనీలో వినాయకుని పూజలు చేస్తున్న భక్తులు




ఇంకొల్లు, మార్టూరు మండలంలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో పూజలందుకుంటున్న వినాయకుడు

దండాలయ్యా .. ఉండ్రాలయ్యా

● వాడవాడలా వినాయకచవితి ఉత్సవాలు
● విశేష పూజలు చేసిన భక్తులు
● ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న గ్రామాలు

పర్చూరు, అగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పర్వదిన వేడుకలను భక్తులు బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోనిపలు కూడళ్లలో పెద్దఎత్తున వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయడంతో సందడి వాతావరణం నెలకొంది. వినాయక విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో దంపతులు పాల్గొని స్వామివార్ల భక్తిని చాటుకున్నారు. వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన పందిళ్లను రంగు రంగు తోరణాలతో అలంకరించారు. పర్చూరు టీనగర్‌లో ఓ ముస్లిం యువతి రూ.40వేలు విలువైన వినాయక విగ్రహాన్ని అందజేసి ఐక్యతను చాటారు. అదేవిధంగా తూర్పువారివీధి, మద్దబజార్, జయంతి కాలనీ, రామాలయం వీధి, అద్దంకి మాన్యం, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజాకార్యక్రమాలు చేపట్టారు. అదే విధంగా నాగుపాలెం, వీరన్నపాలెం, ఉప్పుటూరు, చెరుకూరు, కొల్లావారిపాలెం, ఉప్పుటూరు, చెరుకూరు, తిమ్మరాజుపాలెం, దేవరపల్లి, అన్నంబొట్లవారిపాలెం, నూతలపాడు, పోతుకట్ల తదితర గ్రామాల్లో వినాయక చవితి పండుగ అత్యంత వేడుకగా జరిగాయి.

కారంచేడు : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి పర్వదిన వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. స్థానిక మాస్కోబజార్, ప్రధాన వీధుల్లోని ఆయా కూడళ్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిళ్లలో గణనాథుల విగ్రహాలతో విశిష్ట పూజలు చేపట్టారు. మండలంలోని కుంకలమర్రు, స్వర్ణ, స్వర్ణపాలెం, దగ్గుబాడు, జరుబుల వారిపాలెం, నాయుడు వారిపాలెం తదితర గ్రామాల్లో వినాయక చవితి పండుగను అత్యంత వేడుకగా జరుపుకున్నారు.

పంగులూరు : మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సవ కమిటీలు ప్రత్యేక మండపాలు ఏర్పాటుచేసి వాటిని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలలో వినాయక విగ్రహాలను ఉంచి వీధుల్లో మేళతాళాలతో, బాణాసంచా కాలుస్తూ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించి యువత సందడి చేశారు. అనంతరం మండపాలలో కొలువుదీరిన గణనాథులకు భక్తులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. గ్రామాలలోని పలువాడలలో ఏర్పాటు చేసిన మండపాలలో బుధ, గురువారాలలో గణనాథు లకు పూజాకార్యక్రమాలు కొనసాగించడంతో గ్రామా లలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

ఇంకొల్లు : వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని, మండలంలో వినాయకచవితి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇంకొల్లులో రామమందిరం, కృష్ణనగర్ ఆంజనేయస్వామి గుడి, నాగులచెరువుకట్ట, అభయాంజనేయస్వామి ప్రధాన వీధుల్లో పెద్దఎత్తున వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. గంగవరం, ఇడుపులపాడు, భీమవరం, నాగండ్ల, హనుమోజిపాలెం గ్రామాలలో వినాయకచవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రూపాలలో గణపతి విగ్రహాలను ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ప్రసాదాలు అందజేసారు.

మార్టూరు : వినాయకచవితి పర్వదినాన్ని బుధవారం మండలంలో ప్రజానీకం ఘనంగా జరుపుకున్నారు. వినాయకుని విగ్రహాలను కొనుగోలు కేంద్రం నుంచి మండపాలకు తరలించే సమయంలో యువకులు భారీగా బాణాసంచా కాలుస్తూ, ఆటపాటలతో, డప్పుల మోతతో ఊరేగింపుగా మండపాలకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో కార్యాలయప్రతినిధి కొమ్మినేని వెంకట్ దంపతులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు అర్చకులు శంకర్‌శాస్త్రి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సిబ్బంది నైవేద్యాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కామేపల్లి హరిబాబు, సిబ్బంది సతీష్, సంపత్, అశోక్, మహేష్, అనిల్, సాయి, ఫణి తదితరులు పాల్గొన్నారు. అదేవిదంగా మార్టూరులోని తూర్పుబజారులో కావలి వద్ద చాగల్లు నుంచి తీసుకొచ్చిన 14 అడుగులు ఎత్తైన వినాయకుని విగ్రహాన్ని ,పడమర బజారున విజయవాడ దగ్గ నన్నూరు నుండి తీసుకువచ్చిన 15 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని, నేతాజీనగర్‌లో గుంటూరు నుండి తీసుకువచ్చిన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. బుధ, గురు వారాలు స్వామి వారి విగ్రహాల ముందు పలువురు దంపతులు కూర్చొని పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. రాత్రి సమయాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.


బల్లికురవ : మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం వినాయకచవితి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామాలలో విద్యార్థులు పొలాలకు వెళ్లి వినాయకుడికి ఇష్టమైన పత్రిని సేకరించారు అనంతరం గ్రామ కూడళ్లలో, గృహాలలో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. గతంలో ఎన్నడు లేని విధంగా బల్లికురవ మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో భక్తులు పోలీసుల అనుమతుల మేరకు 116 వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో వినాయక పూజలు

చినగంజాం : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వినాయకచవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో బుధ, గురువారాలలో వైభవంగా నిర్వహించారు. వినాయక చవితిని పురస్కరించుకొని వీధివీధిన గణనాథుని విగ్రహాలను పోటా పోటీగా ఏర్పాటు చేశారు. మండపాల్లో విభిన్న రూపాల్లో ఉన్న గపణయ్యలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మండపాలను రంగు రంగుల విద్యుత్ దీపాల అలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గృహాలలో మట్టి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి విద్యార్థులు పూజలు నిర్వహించారు. అందంగా ముస్తాబు చేసిన మండపాల్లో కొలువు తీరిన లంబోదరునికి భక్తులు భక్తి శ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. పెదగంజాం, సంతరావూరు, గొనసపూడి, చింతగుంపల్లి, కడవకుదురు, పెదగంజాం, మోటుపల్లి, చినగంజాం, సోపిరాల, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం, కొత్తపాలెం, మూలగానివారిపాలెం, నీలాయపాలెం తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి వినాయకచవితి ఉత్సవాలను కన్నులపండువగా నిర్వహించారు. పలు గ్రామాల్లోని విగ్రహాల వద్ద భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల్లోని విగ్రహాలను గురువారం నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు.

అద్దంకి : వినాయక నిమజ్జనాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. అద్దంకి పట్టణంలో ఇళ్లలో ఏర్పాటు చేసుకొని పూజలు నిర్వహించిన వినాయక విగ్రహాలను గురువారం గుండ్లకమ్మ నదిలో వంతెన పై నుంచి నిమజ్జనం చేశారు. దీంతో గుండ్లకమ్మ వంతెనపై సందడి నెలకొంది. అద్దంకి పట్టణం, మండలంలోని అన్ని గ్రామాలలో కలిపి మొత్తం 139 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. అత్యధిక శాతం వి గ్రహాలను 5వ రోజు ఆదివారం నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తిమ్మాయపాలెం సమీపంలో గుండ్లకమ్మ నదిలో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వీలుగా సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సాయంతో శుభ్రం చేయించారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా అవసరమైన మేర బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. వినాయకుడి మండపాల వద్ద, నిమజ్జనం సమయంలో భక్తులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. చిన్నపిల్లలను ఒంటరిగా నిమజ్జనం వద్దకు పంపించ వద్దని తెలిపారు. తల్లిదండ్రులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సంతమాగులూరు : వినాయకచవితి సందర్భంగా మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలోని దక్షిణంబజారులోని విఘ్నేశ్వర యువత ఆధ్వర్యంలో నాలుగేళ్లగా మట్టి వినాయకుడిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది ఏర్పాటు ఏర్పాటు చసిన పంచముఖ వేఘ్నేశ్వరస్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎస్సై పట్టాభి రామయ్య విగ్రహాన్ని పరిశీలించి మట్టివినాయకులతో పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు.






మక్కెనవారిపాలెంలో ఏర్పాటు చేసిన పంచముఖ మట్టి విగ్రహం, ముక్తేశ్వరంలో వినాయకుడికి పూజలు, చిన్నగంజాం బాపయ్య నగర్‌లో, అద్దంకి గుండ్లకమ్మలో వినాయకుని నిమజ్జనం

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం

● మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు
● మార్టూరు చేరిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర



పాదయాత్రలో భాగంగా నినాదాలు చేస్తున్న మాల సంక్షేమ సంఘాల నాయకులు

మార్టూరు, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, రాజ్యాగం స్ఫూర్తికి వ్యతిరేకంగా తీర్పు ఉందని, మాల ఉద్యోగుల సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షులు తుల్లిబిల్లి అశోక్ బాబు అన్నారు. రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్రను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం ఈ యాత్ర మార్టూరు చేరింది. ఈ సందర్భంగా యాత్ర బృందం పాదయాత్ర చేస్తూ మార్టూరు కూడలి నుంచి గన్నవరం రోడ్డు ద్వారా నేతాజీ నగర్, రామ్ నగర్ కూడలి వదకు చేరి అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించింది. అనంతరం అక్కడ మాలల ఆత్మీయ సమావేశంలో అశోక్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో విద్యావంతులైన మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పెరిగిన ఎస్సీ జనాభాకు అనుగుణంగా 20 శాతం రిజర్వేషన్‌ను పెంచాలన్నారు. అదేవిదంగా దళిత క్రైస్తవులకు రిజర్వేషను అమలు చేయాలన్నారు. ప్రవేటురంగాలలో రిజర్వేషనును అమలు చేయాలన్నారు. తరువాత రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు డాక్టరు దాసరి చెన్నకేశవులు మాట్లాడుతూ వర్గీకరణ బిల్లును కూటమి ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో 42 లక్షలు ఓట్లు ఉన్న మాలలను రాజకీయపార్టీలు వాడుకొని వదిలేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంక్షేమ రాష్ట్ర కార్యదర్శి వేంద్రపాటి శ్రీనివాసరావు, షైలాచిన నాగేశ్వరరావు, దారా రామారావు, గొట్టిపాటి అంజయ్య, నూకతోటి జాను, క్రాంతి, శ్రీదేవి, కూరాకుల ఇసాక్, ఉలాస గాంధీ, దొప్పలపూడి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు. తరువాత మండలంలోని డేగరమూడి గ్రామంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి యాత్ర బృందం భూమి పూజ చేసింది.

నానో యూరియాతో పంటలకు మేలు

అద్దంకిటౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మాములు యూరియాతో పంటలకు మేలు చేసే మంచి సూక్ష్మజీవులు, వానపాములు చనిపోతాయని, నానో యూరియా పిచికారి చేయడం వలన పంటలకు మరింత మేలు జరుగుతుందని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని నాగులపాడు, వేలమూరిపాడు గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతుతో ఆయన మాట్లాడారు. అర లీటరు నానో యూరియా ఒక బస్తా యూరియాతో సమానమన్నారు. నానో యూరియా పిచికారి చేయడం వలన పంట ఆకులపై పడి సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. మందు భూమిపై పడకపోవడం వలన భూమిలో పంటలకు మేలు చేసే జీవులకు నష్టం వాటిల్లదన్నారు. మండలంలో ఎరువులు సమృద్దిగా ఉన్నాయని రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ చాందిని, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం




కేకు కట్ చేస్తున్న ఎంఆర్‌పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు పూనూరి నరేంద్ర మాదిగ మాట్లాడుతూ మందకృష్ణమాదిగ న్యాయకత్వంలో 18 సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఏర్పాటు చేసి అనేక పోరాటాలు చేసిందన్నారు. తద్వారా వారి హక్కులను సాధించుకొందన్నారు. దీంతో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలల్లో ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూనూరి రమేష్‌మాదిగ, పూనూరి నేహేమియామాదిగ, మండల అధ్యక్షుడు పాలెపోగు సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు దాసరి బుల్లెయ్య మాదిగ నాయకులు స్వామి అప్పారావు, రామకృష్ణ, ఎరగాని లక్ష్మిరెడ్డి, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కులను సంరక్షించండి

చీరాల : దివ్యాంగుల హక్కులను పరిరక్షించాలని మున్సిపల్ చైర్మన్ సాంబ శివరావును నవ్యాంధ్ర దివ్యాంగులు హక్కుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా కోరారు. గురువారం చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలకు సంబంధించిన వినతిపత్రం అందజేశారు. జీవో నెం.43 ప్రకారం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలలో 5 శాతం అమలు పరచాలని కోరారు.

మణికేశ్వరానికి బస్సు సౌకర్యం



బస్సు సేవలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

అద్దంకి, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మణికేశ్వరం, కొంగపాడు గ్రామాలకు గురువారం నుంచి బస్సు సౌకర్యం పునరుద్ధరించారు. గతంలో అద్దంకి నుంచి మణికేశ్వరానికి బస్సు సర్వీసు ఉన్నా.., కరోనా సమయంలో రద్దు చేశారు. ఈ నేపథ్యంలో మణికేశ్వరం గ్రామస్థులు ఇటీవల మంత్రి రవికుమార్‌ను కలసి బస్ సర్వీసును పునరుద్దరిం చాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులతో మంత్రి రవికుమార్ సర్వీసును పనురద్ధరించేలా చేశారు. ప్రతి రోజు ఉదయం 5-30, సాయంత్రం 3 గంటలకు, రాత్రి 7 గంటలకు అద్దంకిలో బయలుదేరి మణికేశ్వరం వస్తుందని డీఎం రామ్మోహనరావు తెలిపారు. అదే సమయంలో వినుకొండ, నర్సరావుపేట, ఒంగోలులకు అదనంగా రెండేసి ట్రిప్పులు బస్ లు పెంచినట్లు తెలిపారు. నియోజకవర్గ ఐటడీపీ అధ్యక్షుడు షేక్ కరముల్లా స్థానిక టీడీపీ నేతలతో కలిసి మణికేశ్వరంలో ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బడావలి, రూబేను, రవి, ఆదినారాయణ, కాలేషా, రఘుబాబు, సుధాకర్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడి మృతి

అద్దంకి, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్దుడు చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన దగ్గు శ్రీనివాసరావు(65) ఈ నెల 26న ఉదయం అద్దంకి నుండి మోటార్‌సైకిల్‌పై వెళ్తూ చక్రాయపాలెం గ్రామంలోకి వైద్యసేవల కోసం మలుపు తిరుగుతున్న 104 వాహనాన్ని ఢీ కొట్టాడు. గాయపడ్డ శ్రీనివాసరావును ఒంగోలు ప్రవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

రూ.6 లక్షల విలువైన కోడిపుంజుల చోరీ

● కొప్పవరం గ్రామంలో ఘటన, పోలీసులకు ఫిర్యాదు

సంతమాగులూరు ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పవరం గ్రామపంచాయతీలోని నెహ్రూ నగర్ కాలనీలో పూల రాముకు చెందిన కోళ్ల పెంపకం కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున 15 కోడి పుంజులు చోరీకి గురయ్యాయి. వీటి విలువ సుమారు ఆరు లక్షల రూపాయల వరకు ఉంటుందని బాధితుడు రాము వాపోయారు. ఆ మేరకు గురువారం ఉదయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుదారుని వివరాల ప్రకారం నెహ్రూ నగర్ కాలనీలో 6 నెలలుగా తన ఇంటి పరిసరాల్లో తూర్పు కోళ్ల పెంపకం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో 15 కోడిపుంజుల తో పాటు 15 జాతి కోడి పెట్టలు, 40 కోడి పిల్లలు ఉన్నాయి. బుధవారం రాత్రి వర్షం కారణంగా తాను ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దొంగలు కోళ్ల పెంపకం కేంద్రానికి అడ్డుగా ఉన్న ఇనుప గేటును తొలగించి అందులోని ఖరీదైన కోడిపుంజులను చోరీ చేశారు. బుధవారం ఉదయాన్నే కోళ్ల పెంపకం కేంద్రం వైపు చూడగా కోడిపుంజులు కనిపించకపోవడంతో చోరీకి గురి అయ్యాయని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పూల రాము తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పట్టాభి రామయ్య తెలిపారు.

స్వామిత్వ సర్వేలో కొలతలు నమోదు చేయాలి

చీరాల డీఎల్‌డీవో పద్మావతి ఆదేశం

చినగంజాం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : స్వామిత్వ సర్వేలో క్యూజీఐఎస్ సాఫ్‌వేర్‌ను అసిస్టెంట్ ఇంజనీర్లు డౌన్లోడ్ చేసుకొని అందులో వాస్తవ కొలతలు నమోదు చేయాలని చీరాల డీఎల్‌డీవో కే.పద్మావతి ఆదేశించారు. మండలం లోని కడవకుదురు గ్రామంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను గురువారం ఆమె పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిష్పక్షపాతంగా కొలతలు తీసుకొని తప్పులు లేకుండా నమోదు చేయాలని డీఎల్‌డీవో సిబ్బందికి సూచించారు. 36 అంశాలలో అన్ని వివరాలు నమోదు చేయాలని అన్నారు. గ్రామంలో సర్వే చేయడానికి ఐదు టీంలను వేయాలని గ్రామకార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీ.హెచ్.పూర్ణచంద్రరావు, ఈవోపీఆర్‌డీ టి.సుధాకరావు, గ్రామ కార్యదర్శి పర్చూరు శ్రీనివాసరావు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.